

వడ్డాది కేజీబీవీ ప్రిన్సిపాల్‌కు అస్వస్థత

- రివ్యూ మీటింగ్‌కు చోడవరం ఎమ్మెల్యే కార్యాలయానికి వచ్చి స్పృహ తప్పిన వైనం

· 8లో



ఆస్పత్రిలో ప్రిన్సిపాల్ అన్నపూర్ణ

రక్తమోడిన రహదారి

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

- జమాదులపాలెం వద్ద ఆగి ఉన్న కంటైనర్ లారీని ఢీకొన్న బొలేరో వ్యాన్
- డ్రైవర్‌తోపాటు తీడ గ్రామానికి చెందిన మహిళ మృతి
- కోడూరుకు చెందిన మరో మహిళకు తీవ్రగాయాలు
- రాజమహేంద్రవరం నుంచి పూలు కొనుగోలు చేసి తెస్తుండగా ప్రమాదం

జిల్లాలో రెండు వేర్వేరు ప్రదేశాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. కశింకోట మండలం జమాదులపాలెం సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున రోడ్డుపై ఆగి ఉన్న కంటైనర్ లారీని వెనుక నుంచి వస్తున్న బొలేరో వ్యాన్ ఢీకొనడంతో మహిళతోసహా ఇద్దరు మృతిచెందారు. మరో మహిళకు తీవ్రగాయాలయ్యాయి. గొలుగొండ మండలం లింగంపేట పంచాయతీ రామచంద్రపురం జంక్షన్‌లో శుక్రవారం ఉదయం ఎదురెదురుగా వస్తున్న బైక్‌లు ఢీకొనడంతో గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు మృతిచెందారు. ఈ రెండు ప్రమాదాలకు సంబంధించి వివరాలిలా వున్నాయి.



సత్యనారాయణ వ్యాన్ డ్రైవర్ (ఫైల్ ఫొటో)



కన్నూరు లక్ష్మి (ఫైల్ ఫొటో)



కంటైనర్ లారీ వెనుక భాగంలోకి దూసుకుపోయిన బొలేరో వ్యాన్

కశింకోట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీడ గ్రామానికి చెందిన కన్నూరు లక్ష్మి(40), అనకాపల్లి మండలం కోడూరు గ్రామానికి చెందిన ఎస్.వరలక్ష్మి గాజువాకలో పూల వ్యాపారం చేస్తుంటారు. ఇందుకోసం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో హోల్‌సేల్‌గా పూలు కొనుగోలు చేసి తీసుకువస్తుంటారు. గురువారం కూడా ఇద్దరూ కలిసి రాజమహేంద్రవరం వెళ్లి పూలు కొనుగోలు చేశారు. తిరిగి రావడానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా రావులపాలెం నుంచి దొండకాయల లోడుతో అనకాపల్లి వైపు వస్తున్న బొలేరో వ్యాన్ ఎక్కారు. ఇదే జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలీ గ్రామానికి చెందిన పి.సత్యనారాయణ(25) వ్యాన్ డ్రైవ్ చేస్తున్నాడు. మహిళలిద్దరూ డ్రైవర్ పక్కన క్యాబిన్‌లో కూర్చున్నారు.

వ్యాన్ గురువారం అర్ధరాత్రి 1.45 గంటల సమయంలో కశింకోట మండలం జామాదులపాలెం వద్ద రోడ్డుపై ఆగి ఉన్న కంటైనర్ లారీని వెనుక నుంచి బలంగా ఢీకొన్నది. ఇంజన్‌తో సహా వ్యాన్ ముందుభాగం పూర్తిగా కంటైనర్ లారీ కిందకు దూసుకుపోయింది. దీంతో డ్రైవర్ సత్యనారాయణ, కన్నూరు లక్ష్మి వ్యాన్ శకలాల్లో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతిచెందారు. వరలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని అంబులెన్స్‌లో వరలక్ష్మిని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు పంపారు. సీఐ అల్లు స్వామినాయుడు, ఎస్ఐ లక్ష్మణరావు, పోలీసులు తెల్లవారుజామున మూడు గంటలకు సంఘటన స్థలానికి వెళ్లి క్రేన్ సాయంతో బొలేరో వాహనాన్ని బయటకు తీయించారు. మృతదేహాలను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మధ్యాహ్నం పోస్టుమార్టం ... మిగతా 8వ పేజీలో

రోడ్డు ప్రమాదంలో టీచర్ మృతి

- ఎదురెదురుగా వస్తున్న బైక్‌లు ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం
- గొలుగొండ మండలం రామచంద్రపురం జంక్షన్‌లో ఘటన
- సొంతూరు చింతపల్లి మండలం తాజంగి

కృష్ణాదేవిపేట, జూన్ 27 ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం లింగంపేట పంచాయతీ రామచంద్రపురం జంక్షన్‌లో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డుప్రమాదంలో గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు మృతి చెందారు. ఈ సంఘటనకు సంబం ధించి కృష్ణాదేవిపేట ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపిన వివరాలిలా వున్నాయి.



పాంగి వెంకటకృష్ణ మూర్తి (ఫైల్ ఫొటో)

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం తాజంగి గ్రామానికి చెందిన పాంగి వెంకట కృష్ణమూర్తి (54) ప్రస్తుతం కొయ్యూరు మండలం శరభన్నపాలెం సమీపంలోని నడింపాలెం గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయుడి పని చేస్తున్నారు. నర్సీపట్నం మండలం పాతల క్ష్మీపురంలో ఇల్లు నిర్మించుకుని ఇక్కడ నివాసం వుంటున్నారు. రోజూ ఇంటి నుంచి పాఠశాలకు రాకపోకలు సాగిస్తుంటారు. శుక్రవారం ఉదయం బైక్‌పై పాఠశాలకు వెళుతుండగా గొలుగొండ మండలం రామచంద్రపురం జంక్షన్ వద్దకు వచ్చేసరికి ... మిగతా 8వ పేజీలో

జ్వరాల విజృంభణ



వర్షాలు, వాతావరణ మార్పులతో ప్రబలుతున్న మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్

- వైరల్ జ్వరాలతో బాధపడుతున్న జనం
- బాధితులతో ఆస్పత్రులు కిటకిట



అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో రక్తపరీక్షల కోసం వేచివున్న జ్వరపీడితులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి) జిల్లాలో గత కొద్ది రోజులుగా జ్వరాలు విజృంభిస్తున్నాయి. వయసుతో పని లేకుండా అందరినీ పట్టిపీడిస్తున్నాయి. నాలుగు రోజుల నుంచి ముసురు వాతావరణం నెలకొనడం, అంతకుముందు ఎండ తీక్షణంగా కాయడంతో ప్రజలు వైరల్‌జ్వరాలబారిన పడుతున్నారు. జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్లు నొప్పులతో సతమతం అవుతున్నారు. దీనికితోడు గ్రామాల్లో పారిశుధ్య లోపం వల్ల దోమలు, ఈగల బెడద పెరిగిపోయింది. దోమల కారణంగా మలేరియా, డెంగ్యూ జ్వరాలు, ఈగల కారణంగా టైఫాయిడ్ బారిన పడుతున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు రోగులు క్యూ కడుతున్నారు. వైద్యులు సాధారణ జ్వరాలుగానే చెబుతున్నప్పటికీ రక్త పరీక్షల్లో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలుగా నిర్ధారణ అవుతున్నాయి. మాడుగుల, చీడికాడ, దేవరాపల్లి, రోలుగుంట, రావికమతం, నాతవరం, గొలుగొండ మండలాల్లోని మారుమూల గిరిజన గ్రామాల్లో జ్వరాలు అధికంగా వున్నాయి. ప్రతి ఇంటిలో ఒకరిద్దరు జ్వరంతో బాధపడున్నట్టు బాధితులు వాపోతున్నారు. జ్వరాల గుర్తింపునకు ఆశా వర్కర్లు, వైద్య, ఆరోగ్య శాఖ, మలేరియా విభాగం సిబ్బంది క్షేత్రస్థాయిలో సర్వేలు జరుపుతున్నారు. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్ వంటి లక్షణాలు కనిపిస్తే రక్త నమూనాలు సేకరించి, సమీపంలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులకు పంపుతున్నారు. కాగా అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి, నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రికి కొద్ది రోజుల నుంచి జ్వరపీడితుల తాకిడి ఎక్కువగా ఉంది. జ్వర బాధితుల్లో కొంతమంది ప్రభుత్వ ఆస్పత్రులకు కాకుండా అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, ఎలమంచిలి, పాయకరావుపేటల్లోని ప్రైవేటు ఆస్పత్రులకు వెళుతున్నారు. రక్తపరీక్షల కోసం అనకాపల్లి వస్తున్న వారి సంఖ్య పెరగడంతో ప్రైవేటు డయోగ్నస్టిక్ సెంటర్లు కిటకిటలాడుతున్నాయి.

జిల్లాలో గత ఏడాది ఐదు డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటికే నాలుగు పాజిటివ్ కేసులు నమోదైనట్టు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. గత ఏడాది జిల్లాలో చికున్ గున్యా జ్వరాలు ఇద్దరికి సోకగా ఈ ఏడాది ఇంతవరకు ఒక్కటి కూడా నమోదు కాలేదు. జిల్లాలో గత ఏడాది మొత్తంలో 3,96,860 మంది నుంచి ... మిగతా 8వ పేజీలో

ఉమ్మడి జిల్లాలో తహశీల్దార్ల కొరత



అల్లూరి జిల్లాలో ఎనిమిది పోస్టులు ఖాళీ

- విశాఖ జిల్లాలో ఐదు, అనకాపల్లి జిల్లాలో మూడు...
- ఇన్‌చార్జులతో కాలక్షేపం
- రోజువారీ పాలనలో ఇబ్బందులు
- అడ్‌హాక్ పదోన్నతులతోనే సమస్య పరిష్కారం
- ఆ దిశగా దృష్టిసారించని మూడు జిల్లాల ఉన్నతాధికారులు

విశాఖపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలో తహశీల్దార్లకు కొరత ఏర్పడింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎనిమిది, విశాఖపట్నం జిల్లాలో ఐదు, అనకాపల్లి జిల్లాలో మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వచ్చే నెలలో విశాఖ జిల్లాలో మరో ముగ్గురు తహశీల్దార్లు పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ఖాళీల సంఖ్య ఎనిమిదికి పెరగనున్నది. పూర్తిస్థాయి తహశీల్దార్లు లేకపోవడంతో మండలాల్లో పాలనపై ప్రభావం పడుతోంది. అయితే తహశీల్దారు ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలి. కానీ, సర్వీస్ కమిషన్ ద్వారా వచ్చిన ప్రొడీటీలు, జూనియర్ అసిస్టెంట్ నుంచి పదోన్నతి ద్వారా డిప్యూటీ తహశీల్దార్లు అయిన వారి మధ్య కోర్టులో వివాదం ఉండడంతో పదోన్నతుల ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఈ నేపథ్యంలో పాలనాపరమైన ఇబ్బందులు లేకుండా చూడాలంటే ప్రస్తుతం సీనియర్ డీటీలకు అడ్‌హాక్ పదోన్నతులు కల్పించి తహశీల్దార్లుగా నియమించవచ్చు. ఇందుకోసం ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా సీనియర్లతో జాబితా సిద్ధం చేసి భూపరిపాలనా ముఖ్య కమిషనర్ అనుమతి తీసుకున్నారు. కానీ ఎందుచేతనో ఆ దిశగా ఇంకా ప్రయత్నాలు ప్రారంభించలేదు.

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా ఇటీవల చేపట్టిన బదిలీల్లో పలువురు తహశీల్దార్లు ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు వెళ్లారు. అల్లూరి జిల్లా నుంచి ఇద్దరిని విశాఖ జిల్లాకు, ముగ్గురిని అనకాపల్లి జిల్లాకు, అనకాపల్లి జిల్లా నుంచి ఒకరిని అల్లూరి జిల్లాకు, విశాఖ నుంచి ఇద్దరిని అనకాపల్లి జిల్లాకు బదిలీ చేశారు. అయితే అనుకూలమైనచోట పోస్టులు రాలేదని విశాఖ జిల్లాలో ఇద్దరు తహశీల్దార్లు సీసీఎల్‌కు వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నారు. అల్లూరి జిల్లా నుంచి ఇద్దరు తహశీల్దార్లు ఇంకా విశాఖ జిల్లాకు రాలేదు. ప్రస్తుతం విశాఖ జిల్లాలో గాజువాక, పెందుర్తి, ఆనందపురం, సీతమ్మధార, ములగాడ మండలాలకు ... మిగతా 8వ పేజీలో

లోసింగిలో స్కూల్ ఏర్పాటుకు చర్యలు

డీఈవో అప్పారావు నాయుడు

- కొండలపై నడుచుకుంటూ గ్రామానికి వెళ్లిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



లోసింగిలో గిరిజన విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ అప్పారావునాయుడు

రోలుగుంట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్ల పంచాయతీ శివారు గిరిజన గ్రామం లోసింగిలో పాఠశాలను ఏర్పాటు చేసి, విద్యార్థుల చదువుకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యా శాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు చెప్పారు. 'బడికి వెళ్లాలంటే పది కిలోమీటర్లు నడవాల్సిందే' అన్న శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి డీఈఓ స్పందించారు. ఉదయం రోలుగుంట మండల కేంద్రానికి చేరుకున్న ఆయన తహసీల్దార్ నాగమ్మ, ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఎంఈఓ జాన్ ప్రసాద్, తదితరులతో కలిసి వాహనాల్లో వై.బి.పట్నం వెళ్లారు. అక్కడి నుంచి కొండలపైన ఉన్న లోసింగి గ్రామానికి నడుచుకుంటూ వెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక గిరిజనులతో మాట్లాడారు. గతంలో ఇక్కడ నివాసేతర ప్రత్యేక శిక్షణ కేంద్రం (స్కూల్) ఉండేదని, కానీ కొంతకాలం తరువాత ఎత్తేశారని గిరిజనులు తెలిపారు. లోసింగి, కొత్తలోసింగి, పాత లోసింగి గ్రామాల్లో బడికి వెళ్లే ... మిగతా 8వ పేజీలో

మార్కెట్ యార్డు అభివృద్ధే లక్ష్యం

శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

- నర్సీపట్నం ఏఎంసీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం



సభలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు



ఏఎంసీ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న గవిరెడ్డి వెంకటరమణ

నర్సీపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ యార్డును రైతులకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయాలని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచించారు. శుక్రవారం పెదబొడ్డేపల్లి మార్కెట్ యార్డులో నర్సీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు వెళ్లాలని నూతన పాలకవర్గానికి సూచించారు. పాలకవర్గం సమావేశాలకు సభ్యులంతా హాజరు కావాలని సూచించారు. గత ప్రభుత్వంలో మూతపడిన ఇక్కడి భూసార పరీక్షా కేంద్రాన్ని రెండు నెలల్లో పునః ప్రారంభించాలని ఏడీని ఆదేశించారు. మార్కెట్ యార్డులో వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకోవడానికి కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేయాలన్నారు. ఇంతకుముందు టీడీపీ అధికారంలో వున్నప్పుడు రైతు బజార్ కోసం కొన్ని దుకాణాలు నిర్మించామని, అదనంగా మరికొన్ని షాపులు నిర్మించి రైతు బజార్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రైతుబజార్ ముందు ఖాళీ స్థలంలో దుకాణాలు, మార్కెట్ యార్డు ప్రవేశమార్గంలో ఉన్న ఖాళీ స్థలంలో ఓపెన్ ఆడిటోరియం నిర్మించి అద్దెకి ఇవ్వాలని, తద్వారా మార్కెట్ కమిటీకి ఆదాయం పెరుగుతుందని సూచించారు. మార్కెట్ సెస్ చెల్లించకుండా వ్యవసాయ ఉత్పత్తులను రవాణా చేస్తున్న వాహనాలను చెక్‌పోస్టు వద్ద డబ్బులు తీసుకొని వదిలేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఏఎంసీ చెక్ పోస్టుల వద్ద సీసీ కెమెరాలు పెట్టాలని ఆదేశించారు. డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు మాట్లాడుతూ, కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి డీసీసీబీ ద్వారా రుణం ... మిగతా 8వ పేజీలో

భక్తి శ్రద్ధలతో జగన్నాథుని రథయాత్ర



రథంపై జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర ఉత్సవమూర్తులు



మాడుగుల: జగన్నాథ రథయాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

జగన్నాథస్వామి రథయాత్ర శుక్రవారం అనకాపల్లి, మాడుగుల పట్టణాల్లో అంగరంగ వైభవంగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొని స్వామివారి రథాన్ని ఉత్సాహంతో లాగారు. అనకాపల్లి ఆలయంలో తొలుత జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రాదేవిల ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ రథోత్సవాన్ని ప్రారంభించారు. పలు వీధులగుండా యాత్ర సాగుతూ. రాత్రికి రైల్వే గూడ్స్‌షెడ్డు వద్ద గల ఇంద్రద్యుమ్న మందిరానికి చేరుకుంది. మాడుగులలో శుక్రవారం జగన్నాథస్వామిని ఆలయం నుంచి రథంపై ఊరేగిస్తూ అత్తవారిల్లయిన ఇంద్రద్యుమ్న మందిరం వరకు ఊరేగింపు నిర్వహించారు.



ఇళ్ల నిర్మాణానికి తీసుకువచ్చిన ఇనుమును పరిశీలిస్తున్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే పంచకర్ల

ఇళ్ల నిర్మాణంలో నాణ్యత లేదు

- నాసిరకం మెటీరియల్ వినియోగం
- గృహ నిర్మాణశాఖ మంత్రి పార్థసారథి
- పైడివాడఅగ్రహారంలో ఎన్టీఆర్ కాలనీ పరిశీలన

· 8లో

టీడీపీలో కష్టపడేవారికి గుర్తింపు

» రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ 'ప్రగడ'



పట్టణ టీడీపీ నేతల సమావేశంలో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : టీడీపీలో కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం దక్కుతుందని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఇక్కడి కార్యాలయంలో పార్టీ పట్టణ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగడ మాట్లాడుతూ ముున్ముందు పార్టీ కార్యకర్తలకు, నేతలకు మంచి రోజులు రానున్నాయన్నారు. పార్టీ పదవుల్లో, నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు అందనున్నాయని వివరించారు. మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు మాట్లాడుతూ క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తున్న టీడీపీలో కార్యకర్తలకు తగిన గౌరవం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. అనంతరం టీడీపీ పట్టణ కమిటీని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రాజాన సూర్యనాగేశ్వరరావు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గొర్లె నానాజీ, ఆడారి ఆదిమూర్తి, ఉపాధ్యక్షుడు దంట్ల వెంకట స్వామి, రమణ, కరణం రవి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పట్టణ కమిటీ కార్యవర్గం

టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా గొర్లె నానాజీ, ప్రధాన కార్యదర్శిగా ఆడారి ఆదిమూర్తిలను ఎన్నుకున్నారు. అలాగే, ఉపాధ్యక్షులుగా దంట్ల వెంకటస్వామి, కార్యనిర్వాహక కార్యదర్శిగా కోన చిరంజీవి, పాలరౌతు గణేష్, బొడ్డేడ సంతోష్, కార్యదర్శులుగా పాతాళ రామ దుర్గాప్రసాద్, దుప్పట్ల శంకరరావు, కర్రి వెంకటస్వామి, కోశాధికారిగా తండేటి అప్పలరాజులను నియమించారు. క్లస్టర్-2 కన్వీనర్‌గా బొద్దపు శ్రీనివాసరావు, కో-కన్వీనర్‌గా కరణం రవి కుమార్, క్లస్టర్-3 కో-కన్వీనర్‌గా మళ్ల మురళీలను నియమించారు.

'టీడీపీలో సంస్థాగత ఎన్నికలు ఎప్పుడూ ఇలా లేవు'

మునగపాక, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ఏర్పాటైన టీడీపీ గ్రామ, మండల స్థాయి కమిటీలు పార్టీ శ్రేణుల మనోభావాలకు అనుగుణంగా లేవని రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి దాడి ముసిలినాయుడు అన్నారు. స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో శుక్రవారం టీడీపీ మండల స్థాయి ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 సంవత్సరాలుపైగా చరిత్ర కలిగిన టీడీపీలో సంస్థాగత ఎన్నికలు ఈ విధంగా ఎప్పుడూ జరగలేదన్నారు. దీని ప్రభావం రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై పడకుండా చూడాలని హితవు పలికారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండు పర్యాయాలు పార్టీ మండల అధ్యక్షుడుగా చేశానని, ఇప్పుడు తనకు ఆశలేదని వివరించారు. అందరికీ ఆమోదయోగ్యమైన వారికి ఇవ్వాలన్నదే తన అభిమతమని పేర్కొన్నారు. క్లస్టర్-2 మాజీ ఇన్‌చార్జి కొరపాటి వీరరాజశేఖర్ మాట్లాడుతూ టీడీపీ సంస్థాగత ఎన్నికలు సిద్ధాంతాలకు విరుద్ధంగా జరిగాయన్నారు. ఈ సమావేశంలో నాయకులు మొల్లేటి సత్యనారాయణ, కర్రి రామనాగేశ్వరరావు, కాండ్రేగుల నాయుడు, ఉస్తేలు నాయుడు, ఆడారి ఆనందసన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో వరి విత్తనాలు : ఏవో

రాంబిల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన వరి విత్తనాలను రైతు సేవా కేంద్రాల్లో ఉందుబాటు ఉంచామని మండల వ్యవసాయాధికారిణి సి.సుమంత తెలిపారు. శుక్రవారం ఆమె గొరపూడిలో రైతులకు రాయితీపై విత్తనాలను పంపిణీ చేసి మాట్లాడారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్టు చెప్పారు. సాగులో ఎటువంటి సమస్యలు ఉన్నా తమను కలిసి తగిన సహాయ సహకారాలు పొందాల్సిందిగా ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

డిసెంబరు నెలాఖరుకు ఈఎస్ఐ సేవలు

» ఎమ్మెల్యే విజయకుమార్ వెల్లడి » సెజ్ పరిధిలో జరుగుతున్న ఆసుపత్రి భవన నిర్మాణ పనులు పరిశీలన



ఆసుపత్రి నమూనా చిత్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురంలో ఈఎస్ఐ ఆసుపత్రి పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. సెజ్ జరుగుతున్న ఈ భవన నిర్మాణాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా భూసేకరణ జరిగినా భవన నిర్మాణం జరగలేదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు కేటాయించడంతో నిర్మాణం పనులు పరుగులు తీస్తున్నాయని వివరించారు. డిసెంబరు నెలాఖరుకు భవన నిర్మాణం పూర్తయి ఆసుపత్రి అందుబాటులోకి రానుందని చెప్పారు. ఈ ఆసుపత్రిలో సర్జరీ, గైకాలజీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్, ఎనస్తీషియా, మందులు తదితర సదుపాయాలతో సెకండరీ కేర్ సేవలను అందిస్తారన్నారు. పదిమంది అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులను నియమించే కర్మాగారాలు, సంస్థల ద్వారా నెలకు రూ.21 వేలు అంతకంటే తక్కువ వేతనాలు పొందేవారు, వారి కుటుంబ సభ్యులు ఈ ఆసుపత్రిలో సేవలు పొందేందుకు అర్హులుగా పేర్కొన్నారు. అచ్యుతాపురంలోని సెజ్‌లో సుమారు 250కి పైగా కర్మాగారాలు ఉన్నాయన్నారు. వీటిలో వేల సంఖ్యలో ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నారని, వీరికి ఎటువంటి అనారోగ్యం చేసినా ఈఎస్ఐ ఆసుపత్రి ద్వారా వైద్య సేవలు పొందవచ్చునని వివరించారు. ముఖ్యంగా అనుకోని విధంగా కర్మాగారాల్లో ప్రమాదాలు జరిగితే క్షతగాత్రులను గాజువాక, అనకాపల్లి తీసుకువెళ్లాల్సి వస్తోంది. సకాలంలో వైద్యం అందక గతంలో చాలా మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. గత వైసీపీ పాలనలో ఈ ఆసుపత్రి గురించి పట్టించుకోలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే కార్మికుల శ్రేయస్సు దృష్ట్యా ఈ ఆసుపత్రి నిర్మాణ పనులు జరుపుతున్నట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో నాయకులు బైలపూడి శ్రీరామదాసు, ప్రగడ చిన నాగేశ్వరరావు, లాలం నాగేశ్వరరావు, పారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మందుల వాడకంతో క్షయ నివారణ

» జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బాలాజీ



క్షయవ్యాధి గ్రస్థులకు పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్న బాలాజీ

అచ్యుతాపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి ప్రమాదకరం కాదని డీఎం హెచ్‌వో డాక్టర్ బాలాజీ అన్నారు. ప్రధాన మంత్రి టీబీ ముక్తభారత్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం క్షయ వ్యాధిగ్రస్థులకు స్థానిక పీహెచ్‌సీలో లుపిన్ ఫార్మా కంపెనీ సహకారంతో పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ సోకినంత మాత్రాన ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం వ్యాధిని పూర్తిగా నయం చేసే మందులను ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్నట్టు చెప్పారు. కేవలం ఆరు నెలలు మందులు వాడడం ద్వారా వ్యాధిని నియం చేయవచ్చునన్నారు. అలాగే ప్రతినెలా ప్రభుత్వం క్షయ రోగుల బ్యాంకు ఖాతాలకు వెయ్యి రూపాయలు జమచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో లుపిన్ కర్మాగారం ప్రతినిధి హెడ్ పియూష్ విక్టర్, వైద్యాధికారిణి డాక్టర్ కె.శ్రావ్య, టీబీ సూపర్‌వైజర్ వెంకటరమణ, ఆరోగ్య సహాయకులు ఎల్.అప్పల కొండ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగన్నాథ రథయాత్ర



పూజలందుకున్న సుభద్ర, బలభద్ర, స్వామివారు

మునగపాక, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : రథయాత్రను శుక్రవారం ఇక్కడ ఘనంగా నిర్వహించారు. తొలుత ఇక్కడి ఇంద్రద్యుమ్న హాలులో సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం విగ్రహాలను రథంపై అధిష్టించి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఇంద్రద్యుమ్న హాలులో దేవతామూర్తుల విగ్రహాలను ఉంచారు. తొలిరోజు మత్స్యావతారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.

వ్యవసాయ శాఖ ఏడీఏగా జాహ్నవి బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న జాహ్నవి

ఎలమంచిలి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలుగా కె.జాహ్నవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చింతపల్లి నుంచి ఈమె బదిలీపై ఇక్కడికి విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతాంగానికి అవసరమైన సహాయ సహకారాలు అందిం చేందుకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. తొలుత సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు.

కృష్ణంపాలెం త్వరలో ఖాళీ

» సెజ్ నిర్వాసితులకు దిబ్బపాలెంలో పునరావాసం
» కుటుంబ పెద్దతో పాటు, మేజర్ సంతానానికి కూడా స్థలాలు
» లాటరీ విధానంలో కేటాయింపు రేపు
» ఒక్కో కుటుంబానికి రూ.9.98 లక్షల ఆర్‌ఆర్ ప్యాకేజీ
» ఎమ్మెల్యే విజయ్‌కుమార్ వెల్లడి
» అధికారులు, గ్రామ నేతలతో సమావేశం



అధికారులు, గ్రామ నేతలతో సమావేశమైన ఎమ్మెల్యే

అచ్యుతాపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాంబిల్లి మండలం కృష్ణంపాలెం ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్ఈజడ్) నిర్వాసితులకు అచ్యుతాపురం మండలం దిబ్బపాలెంలో పునరావాసం కల్పిస్తున్నట్టు ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఇక్కడ ఏపీఐఐసీ కార్యాలయంలో అధికారులు, కృష్ణంపాలెం గ్రామానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కృష్ణంపాలెం గ్రామస్థులు సుమారు 18 సంవత్సరాల క్రితం 'సెజ్' కోసం భూములు ఇచ్చారని చెప్పారు. భూములకు పరిహారం అందిందని, కానీ పునరావాసం కల్పించక పోవడంతో ఇంతవరకు గ్రామాన్ని ఖాళీ చేయలేదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత 'సెజ్'లో పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో మంది పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని, ఆయా పరిశ్రమలకు భూములు కేటాయించ డానికి కృష్ణంపాలెం గ్రామాన్ని ఖాళీ చేయాల్సి వచ్చిందన్నారు. కృష్ణంపాలెం నిర్వాసితులకు సెజ్ పునరావాస కాలనీ(దిబ్బపాలెం)లో స్థలాలు కేటాయిస్తామని చెప్పారు. ఇంటి యజమానితో పాటు మేజర్లయిన కుమారులు, కుమార్తెలకు కూడా పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆర్‌ఆర్ ప్యాకేజీ కింద ఒక్కో కుటుంబానికి రూ.9.98 లక్షల చొప్పున ఈ నెల 30న వారి బ్యాంకు ఖాతాలకు జమచేస్తామన్నారు. ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు డ్రా ద్వారా ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని, దిబ్బపాలెం పునరావాస కాలనీలో స్థలాలు వద్దనుకొనే వారు దోసూరు పంచాయతీ రావిపాలెం వద్ద అన్ని సౌకర్యాలతో ఏర్పాటుచేస్తున్న లేఅవుట్‌లో స్థలాలు కేటాయిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎస్‌డీసీ అనిత, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎస్.నరసింహారావు, డిప్యూటీ జోనల్ మేనేజర్ కె.సూర్యనారాయణ, కూటమి నాయకులు బైలపూడి శ్రీరామదాసు, రాజాన విజయ్, దిన్‌బాబు, ప్రగడ చిననాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులతో డీపీవో సమీక్ష



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో సందీప్

పాయకరావుపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయం సమావేశ హాలులో పంచాయతీ కార్యదర్శులతో జిల్లా పంచాయతీ అధికారి ఈ.సందీప్ సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, ఇంటి పన్నుల వసూలు తదితర అంశాలపై సమీక్షించారు. పంచాయతీ దృష్టికి ప్రజలు తీసుకువచ్చే సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో అంటు రోగాలు ప్రబలకుండా రోజూ కాలువలు శుభ్రం చేయించడంతోపాటు చెత్తను గ్రామానికి దూరంగా తరలించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలన్నారు. ఇంటి పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు పంచాయతీలో అన్ని రకాల రికార్డుల అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు, డిప్యూటీ ఎంపీడీవో కె.డేవిడ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ ప్యాకేజీ పెంచాలని ఆందోళన



ఆందోళన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఎం నేత అప్పలరాజు

నక్కపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చిరాజుపేట గ్రామంలో కారిడార్ నిర్వాసిత రైతులు గృహ నిర్మాణ ప్యాకేజీ పెంచాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆందోళనకు దిగారు. వీరికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు ఎం.అప్పలరాజు సంఘీభావం ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బుచ్చిరాజుపేట, చందనాడ, మూలపర్ర, పాటిమీద, బోయపాడు గ్రామాలకు చెందిన నిర్వాసిత రైతులకు నక్కపల్లి మండలం పెదబబో దిగల్లం రెవెన్యూ పరిధిలో పునరావాసం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని చెప్పారు. ఐదు సెంట్ల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.8.98 లక్షలు ప్యాకేజీ ఇస్తానని అధికారులు ప్రకటించారన్నారు. ఈ మొత్తంతో ఇంటి నిర్మాణం సాధ్యం కాదన్నారు. అందువల్ల మెరుగైన ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.బాబ్జీ, ఎం.ప్రసాద్, వై.అప్పారావు, ప్రసాద్, వెంకటేశ్, శ్రీను, మంగ తదితరులు పాల్గొన్నారు.

జనసేన నేత షేక్ రసూల్ సస్పెన్షన్

చోడవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వడ్డాది కస్తూర్బాగాంధీ స్కూల్ ప్రిన్సిపాల్ కోసూరి అన్నపూర్ణ పట్ల అనుచితంగా ప్రవర్తించిన ఘటనకు సంబంధించి బుచ్చెయ్యపేట మండలం వడ్డాదికి చెందిన జనసేన నేత షేక్ రసూల్‌ను పార్టీ నుంచి తొలగిస్తున్నట్టు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు శుక్రవారం రాత్రి ఓ ప్రకటనల తెలిపారు. వడ్డాది కేజీబీవీ ప్రిన్సిపాల్ అన్నపూర్ణకు రసూల్ గురువారం బెదిరింపులతో పాటు హెచ్చరికలు జారీ చేయడం, శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఆమె పట్ల అనుచితంగా ప్రవర్తించిన తీరు జనసేన ఆశయాలకు వ్యతిరేకంగా ఉందని ఆయన పేర్కొన్నారు. దీనిపై సమగ్ర సమాచారం సేకరణ అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు ఆదేశాల మేరకు రసూల్‌ను పార్టీ నుంచి తొలగించామని వెల్లడించారు.

పారిశుధ్య పనులు వెంటనే చేపట్టండి

» ఇంటింటా చెత్త సేకరించి సంపద కేంద్రానికి తరలించాలి
» జిల్లా పంచాయతీ అధికారి ఈ.సందీప్



మంగవరంలో చెత్త సేకరిస్తున్నారా? లేదా? అని మహిళను అడుగుతున్న డీపీవో

పాయకరావుపేట రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య పనులు వెంటనే చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి ఈ.సందీప్ ఆదేశించారు. మండలంలోని మంగవరం గ్రామాన్ని శుక్రవారం సందర్శించారు. గ్రామంలోని వీధుల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళలను ఇళ్ల నుంచి కార్మికులు చెత్త సేకరిస్తున్నారా? వీధుల్లో పారిశుధ్య పనులు ఎలా చేపడుతున్నారో అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ కాలనీ వాసులు తమ కాలనీలో రోడ్లు, డ్రైన్లు, నిర్మించాలని, శ్మశానానికి రోడ్డు వే యాలని ఆయనను కోరారు. ఉపాధి నిధులతో రోడ్లు నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఇళ్ల నుంచి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పూర్తి స్థాయిలో వినియోగించాలన్నారు. గ్రామంలో రోడ్లపై చెత్త, చెదారాలను ఎప్పటి కప్పుడు తరలించాలన్నారు. మంగవరంలో గ్రీన్ అంబాసిడర్లు తక్కువగా ఉన్నందున మిగతా పంచాయతీల్లోని వారిని తీసుకు వచ్చి రెండు రోజులలో చెత్త తొలగించాలని కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో తాగునీరు, ఇళ్ల పన్ను వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు, డిప్యూటీ ఎంపీడీవో డేవిడ్, పంచాయతీ కార్యదర్శులు కొండలరావు, వైవీ.సత్యనారాయణ, మల్లికార్జునాచారి, రమేశ్, టీడీపీ మండల అధ్యక్షుడు చింతలపు ప్రదీప్, మంగవరం కాలువ చైర్మన్ గూటూరు రామగోవిందు, ఏఎంసీ వైస్ చైర్మన్ కంకిపాటి వెంకటేశ్వరరావు, వంగలపూడి రామారావు, దేవవరపు ఆనంద్, గోవిందు, కోనే కొండబాబు, కట్టా దొర, తదితరులు పాల్గొన్నారు.

జేవీ పాలెంలో తాగునీటి కుళాయిపై వివాదం

జనసేన నేత కుళాయి కనెక్షన్ అడ్డుకున్న టీడీపీ నేత శంకరరావు

హోం మంత్రి ఆదేశాలతో ఎంపీడీవో, ఎస్ఐ సమక్షంలో కనెక్షన్ ఏర్పాటు

జనసేన నేత సతీశ్‌ను పరామర్శించిన నియోజకవర్గ ఇన్‌చార్జి బుజ్జి



కుళాయి కనెక్షన్ ఏర్పాటు చేయిస్తున్న ఎంపీడీవో, ఎస్ఐ, గెడ్డం బుజ్జి తదితరులు

ఎస్.రాయవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జేవీ.పాలెం గ్రామంలో తాగునీటి కుళాయి ఏర్పాటు విషయమై వివాదం తలెత్తింది. గ్రామంలో చేపట్టిన పారిశుధ్య పనుల్లో భాగంగా గురువారం కక్షతో తమ కుళాయి కనెక్షన్‌కు చెందిన ప్రదేశాన్ని మూసివేయిస్తున్నారని అదే గ్రామానికి చెందిన జనసేన పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గొర్లె సతీశ్ అడ్డుకున్నారు. దీంతో సతీశ్, ఆయన తల్లిపై గ్రామ సర్పంచ్ భర్త, టీడీపీ నేత వజ్రపు శంకరరావు దౌర్జన్యానికి పాల్పడిన దృశ్యాలను వీడియోల ద్వారా హోం మంత్రి వంగలపూడి అనిత, జిల్లా ఉన్నతాధికారులు తెలుసుకున్నారు. దీంతో వారు వెంటనే స్పందిస్తూ ఆ ఇంటికి కుళాయి కనెక్షన్ ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఎంపీడీవో సత్యనారాయణ శుక్రవారం ఆ గ్రామానికి వెళ్లి కార్యదర్శిని పిలిపించి సిబ్బందితో వెంటనే కులాయి కనెక్షన్ ఏర్పాటు పనులను దగ్గరుండి చేయించారు. ఈ వివాదం గురించి తెలుసుకున్న జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి గ్రామానికి వెళ్లి సతీశ్ కుటుంబాన్ని పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. సుమారు మూడు నెలల క్రితం డ్రైనేజీ నిర్మాణం పేరుతో అడ్డంగా ఉందంటూ తొలగించిన కుళాయి కనెక్షన్‌ను, టీడీపీ నేత శంకరరావు వ్యక్తిగత కక్షతో అప్పటి నుంచి ఏర్పాటు చేయనీయకుండా అడ్డుకున్నారని, ఈ విషయంపై స్వయంగా తాను గ్రామానికి వెళ్లి చెప్పినప్పటికీ కనెక్షన్ ఇవ్వడం జరగదని శంకరరావు చెప్పాడని ఈ సందర్భంగా బుజ్జి ఆగ్రహం వ్యక్తం చేశారు. హోం మంత్రి స్పందించి ఎంపీడీవో సమక్షంలో ఏర్పాటు చేయించిన కులాయి కనెక్షన్‌ను బుజ్జి పరిశీలించారు. అలాగే టీడీపీ నేత శంకరరావుపైగురువారం రాత్రి జనసేన నేత సతీశ్ ఇచ్చి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ఎస్ఐ విభీషణరావు శుక్రవారం సతీశ్ ఇంటికి వెళ్లి విషయాన్ని అడిగి తెలుసుకోవడంతో పాటు ఎంపీడీవో కలిసి దగ్గరుండి కులాయి కనెక్షన్ ఏర్పాటు చేయించారు.

అల్లూరి జయంతి వేడుకలకు ముమ్మర ఏర్పాట్లు

జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణరావు

కృష్ణాదేవిపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా రెవెన్యూ అధికారి వైఎస్.సత్యనారాయణరావు తెలిపారు. గొలుగొండ మండలంలోని కృష్ణాదేవిపేట అల్లూరి పార్కులో జరుగుతున్న ఏర్పాట్లను నర్సీపట్నం ఆర్డీవో రమణతో కలిసి శుక్రవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ పార్కులో శిథిలమైన నాలుగు ప్రగోడాలను మరమ్మతు చేస్తున్నట్టు చెప్పారు. అలాగే పార్కులో మొక్కలు నాటడంతో పాటు ప్రహరీ, విగ్రహాలు, మందిరాలకు రంగులు వేస్తున్నట్టు ఆయన తెలిపారు. అల్లూరి జయంతికి స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో పాటు డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు, రాష్ట్ర, కేంద్ర మంత్రులు, ఎంపీలు, క్షత్రియ సంఘం నాయకులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ తహసీల్దార్ శ్రీనివాసరావు, వీఆర్‌వోలు రాజు, పడాల్, టీడీపీ నాయకులు బొడ్డు జమీలు, చిట్టిబాబు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపాధి పనులపై ప్రజావేదిక

పాయకరావుపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 24 పంచాయతీల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీలకు సంబంధించి శనివారం ప్రజా వేదిక నిర్వహిస్తామని ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉదయం 10 గంటల నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమానికి సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు హాజరుకావాలని ఆయన కోరారు.

30న మండల సమావేశం

కోటవురట్ల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 30 సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో కాశీవిశ్వనాథం ఒకప్రకటనలో తెలిపారు. ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు అధ్యక్షతన జరుగనున్న ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని ఆయన సూచించారు.

సురక్షిత తాగునీరు అందించాలి

నక్కపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రక్షిత పథకాల ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేసి ప్రజలకు సురక్షిత తాగునీటిని సరఫరా చేయాలని ఎంపీడీవో డి.సీతారామరాజు ఆదేశించారు. మండలంలోని సీహెచ్ఎల్.పురంలో శుక్రవారం పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంచినీటి ట్యాంకుల క్లోరినేషన్ చర్యలను పరిశీలించారు. గ్రామంలో తడి, పొడి చెత్త ఏరివేతపై ఆరా తీశారు. అనంతరం సంపద కేంద్రాన్ని తనిఖీ చేశారు. సేంద్రియ ఎరువుల ఉత్పత్తులను పెంచాలని సిబ్బంది ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, టీడీపీ నేత ఆనంద్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఎస్.రాయవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఎస్.రాయవరం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె.రాజశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉప్పరాపల్లి, వెంకటాపురం, లింగరాజుపాలెం, జేవీ.పాలెం, సర్వసిద్ధి, కర్రివానిపాలెం, బసవపాడు, సైతారుపేట, వాకపాడు గ్రామాల్లో ఆ రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి తమ సిబ్బందికి సహకరించాలని ఈఈ కోరారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

పాయకరావుపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెవెన్యూ శాఖకు సంబంధించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని టీడీపీ మండల అధ్యక్షుడు చింతలపు ప్రదీప్ విజ్ఞప్తి చేశారు. పాయకరావుపేట తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన మహేశ్వరరావును శుక్రవారం టీడీపీ నాయకులతో కలిసి మండల సమస్యలు వివరించారు. ప్రజలకు అవసరమైన వివిధ ధ్రువపత్రాలను నిర్ణీత సమయంలో మంజూరుకు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ప్రదీప్ కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వై.వరహాలబాబు, చిక్కాల శ్రీనివాసరావు, రాజాన ఆది పాల్గొన్నారు.

ప్రమాదరహితంగా లంకెలపాలెం కూడలి

» త్వరలో పది సీసీ కెమెరాలు ఏర్పాటు » ఎస్పీ తుహిన్ సిన్హా



లంకెలపాలెం కూడలిలో పోలీసు, రవాణా శాఖల అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ

లంకెలపాలెం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై లంకెలపాలెం జంక్షన్‌ను ప్రమాదాలరహితంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటానని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పేర్కొన్నారు. ఈ నెల 23వ తేదీ రాత్రి ఈ కూడలి వద్ద విశాఖ నుంచి వస్తున్న లారీ బీభత్సం సృష్టించిన ఘటనలో ఐదుగురు మృతిచెందిగా, 15 మంది గాయపడిన విషయం తెలిసిందే. దీంతో ఎస్పీ శుక్రవారం ఇక్కడకు వచ్చి కూడలిని పరిశీలించారు. ప్రమాదానికిగల కారణాలను జిల్లా రవాణా శాఖాధికారి గోపిశెట్టి మనోహర్‌ను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఇక్కడ ప్రమాదాలు జరగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టనున్నట్టు ఎస్పీ చెప్పారు. నలువైపులా 10 సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని, వీటి ద్వారా సిగ్నల్ జంపింగ్, అతివేగంగా వెళ్లే వాహనాలను గుర్తించి ఆటోమేటిక్‌గా చలానాలు విధించేలా చేస్తామన్నారు. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో మాట్లాడి ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను మెరుగు పరుస్తామన్నారు. వేగ నియంత్రణకు కూడలిలో స్టాపర్లు, ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయడంతోపాటు రవాణా శాఖ, స్థానిక పోలీసులు రోజూ పర్యవేక్షిస్తూ ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వాహనాలపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట పరవాడ డీఎస్పీ పి.విష్ణుస్వరూప్ ఎంవీఐలు ప్రవీణ్‌కుమార్, గోపీకృష్ణ, తదితరులు వున్నారు.

అర్హులందరికీ పథకాల అమలుకు కృషి



దిబ్బపాలెం గ్రామస్థుల నుంచి వినతి పత్రం స్వీకరిస్తున్న కర్రి బాబీ

తుమ్మపాల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నామని టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబీ తెలిపారు. అనకాపల్లి పట్టణంలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌కు ఆయన హాజరై పలువురు నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం 146 సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. ఎన్నికల హామీలను శతశాతం ప్రభుత్వం అమలు చేయడం ఖాయమని స్పష్టం చేశారు. అర్హులైన వారికి అధికారుల ద్వారా పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరయ్యేలా కృషి చేస్తామని చెప్పారు. దిబ్బపాలెం రోడ్డు మరమ్మతులకు స్థానికుల నుంచి వినతిపత్రం అందగా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నంబారి శ్రీను, మేడిశెట్టి నూకరాజు, షేక్ బాబర్, కరణం శ్రీను, మధుపడ నరసింహారావు, సీహెచ్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యాదవ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు రేపు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు బాబూరావు

అనకాపల్లి టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : యాదవ సామాజిక వర్గానికి చెందిన ఉత్తమ విద్యార్థినీ విద్యార్థులకు ఈ నెల 29వ తేదీన ప్రతిభా పురస్కారాలు ఇవ్వనున్నట్టు యాదవ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భర్నికాన బాబూరావు తెలిపారు. శుక్రవారం ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నూకాంబిక ఆలయం రోడ్డులోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. పదో తరగతిలో 550 మార్కులకుపైగా సాధించిన వారికి, ఇంటర్మీడియట్‌లో 900 మార్కులకు పైగా పొందిన వారికి ఈ పురస్కారాలు ప్రదానం చేయనున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

'జాగృతి' సేవలు అభినందనీయం : నాబార్డు డీడీఎం



వార్షిక నివేదిక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీడీఎం సమంత్, తదితరులు

సబ్బవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : జాగృతి మ్యాక్స్ సంస్థ సభ్యులకు అందిస్తున్న సేవలు అభినందనీయమని నాబార్డు డీడీఎం జి.సమంత్ అన్నారు. సంస్థ మహాజన సభ గొటివాడలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సంస్థ ఎంతోమంది మహిళలకు అండగా నిలుస్తుందన్నారు. అంతకుముందు ఎండీ కందర్ప సుజాత మాట్లాడుతూ జాగృతి మ్యాక్స్ రూ.34.36కోట్ల టర్నోవర్ చేస్తున్నట్టు చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.19.81 లక్షల నికర లాభం అర్జించిందన్నారు. అనంతరం సంస్థ పాలకవర్గ ఎన్నిక నిర్వహించారు. అనంతరం వార్షిక నివేదిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. సంస్థ సీఈవో కందర్ప మౌక్తిక, జిల్లా ఉద్యాన అధికారి ఎంఎ రహీమ్, అనకాపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త ముకుందరావు, ఆడి టర్ వి.సుధాకర్, నూతనంగా ఎన్నికైన సంస్థ అధ్యక్షుడు మారేడుపూడి అబద్ధం, ఉపాధ్యక్షుడు కొటాన సుజాత, పాలకవర్గ సభ్యులతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

అనకాపల్లి టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సుమారు 50 రోజుల క్రితం సైకిల్ పైనుంచి కింద తీవ్రగాయాలకు గురైన వృద్ధుడు విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. గాంధీ నగరానికి చెందిన నున్న సత్యనారాయణ (72) గత నెల మొదటి వారంలో ప్రేమ సమాజం వద్ద సైకిల్ తొక్కుతూ ప్రమాదవశాత్తూ కిందపడ్డాడు. కానీ పైకి గాయాలు కనిపించలేదు. ఈ నెల 16న తల బరువుగా వుందని చెప్పడంతో కుటుంబ సభ్యులు గాజువాకలో ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. తలకు ఆపరేషన్ చేశారు. తరువాత కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్ర వారం మృతిచెందాడు.



అనకాపల్లి రథయాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన వేషధారణలు



రథం పురవీధుల్లో ముందుకు సాగుతుండగా యువత కేరింత

జై జగన్నాథ..

» అనకాపల్లి, కశింకోటలలో నేత్రపర్వంగా రథయాత్ర » దర్శించుకున్న భక్తులు

» తొమ్మిది రోజుల పాటు రోజుకో అవతారంలో దర్శనమివ్వనున్న స్వామి



స్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్సీ బుద్ద



కశింకోటలో సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి వారి రథయాత్ర

అనకాపల్లి టౌన్/కశింకోట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : జగన్నాథస్వామి రథయాత్ర శుక్రవారం అనకాపల్లి, కశింకోటలలో నేత్రపర్వంగా సాగింది. అనకాపల్లిలోని అగ్గిమర్రిచెట్టు వద్ద గల స్వామివారి ఆలయంలో ఉదయం నుంచి ఉత్సవమూర్తులకు విశేష పూజలు జరిపిన అనంతరం సుభద్ర, బలభద్ర సమేత స్వామివారి రథయాత్రను పారంభించారు. ఎమ్మెల్యే కొణతాలతో పాటు మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, కేఎం నాయుడు, పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. డీఎస్పీ ఎం.శ్రావణి ఆధ్వర్యంలో పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకవర్గ ఛైర్మన్ దాడి బుజ్జి, కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన నేల వేషాలు, పులి వేషాలు, మహిళల నాట్యాలు, కోలాటాలు, తప్పెట గుళ్లు, తోడపెద్దు సేవ తదితరాలు భక్తు లను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇదిలావుంటే, మండల కేంద్రం కశింకోటలోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో జగన్నాథస్వామి రథయాత్ర ఘనంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. సాయంత్రం ఉత్సవమూర్తులను రథంపై అధిష్ఠించి గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లారు. తొమ్మిది రోజుల పాటు ఉత్సవమూర్తులు ఒక్కో అవతారంలో దర్శనమివ్వనున్నారని అర్చకులు రేజేటి రాంబాబు, రేజేటి కన్నబాబు, మారుతి, చరణ్ తెలిపారు.

ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు తెలపండి

» 30 వరకు గడువు » జూలై 21న తుది జాబితా విడుదల

» రాజకీయ పార్టీల నేతల సమావేశంలో డీఆర్వో



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఆర్వో సత్యనారాయణరావు

అనకాపల్లి కలెక్టరేట్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఉంటే రాజకీయ పార్టీల నేతలు తమ దృష్టికి తీసుకురావాలని జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు సూచించారు. కలెక్టరేట్‌లోని చాంబర్‌లో శుక్రవారం రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలోని లోపాలు, మార్పులు, చేర్పులు ఉంటే ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకు వెళ్లనున్నట్టు చెప్పారు. ఈ నెల 30వ తేదీ నాటికి సంబంధిత అధికారులకు నివేదికలు ఇవ్వాలన్నారు. జూలై 21వ తేదీన ఓటర్ల జాబితా విడుదల చేయడం జరుగుతుందని చెప్పారు. సదరు జాబితాలో అభ్యంతరాలపై అదే నెల 30వ తేదీలోపు స్వీకరిస్తామని వివరించారు. ఆగస్టు రెండో తేదీన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాయుడు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈవీఎంల గోదాం తనిఖీ

ఇదిలావుంటే, ఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో భద్రపరిచిన ఈవీఎంల గోదాంను డీఆర్వో తనిఖీ చేశారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఆర్డీవో షేక్ ఆయీషా, రాజకీయ పార్టీ నేతల సమక్షంలో ఈ ప్రక్రియను చేపట్టారు. గోదాం ప్రధాన ద్వారానికి ఉన్న సీల్‌ను పరిశీలించి, సీసీ కెమెరాల పనితీరును తెలుసుకున్నారు. లోపల భద్రపరిచిన ఈవీఎంలను, అగ్నిమాపక పరికరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీ నాయుడు, రాజకీయ పార్టీ నాయకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో చెత్త తరలింపు



డంపింగ్ యార్డులో చెత్తను తరలిస్తున్న దృశ్యం

తుమ్మపాల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ తుమ్మపాల మెయిన్ రోడ్డును ఆనుకొని ఉన్న డంపింగ్ యార్డులో గల చెత్త తరలింపు ప్రక్రియను శుక్రవారం చేపట్టారు. వాహనాల ద్వారా కాపులుప్పాడకు తరలిస్తున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ ఈవో ఈశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల ఈ సమస్యను గ్రామస్థులు తమ దృష్టికి తెచ్చారన్నారు. దీనిపై ఉన్నతాధికారుల సూచనల మేరకు డంపింగ్ యార్డులో చెత్తను పంపిస్తున్నామన్నారు. పేరుకుపోయిన చెత్తను పూర్తిస్థాయిలో తొలగించి స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. వర్షాలు కురుస్తున్నందున పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పంచాయతీలో ఎప్పటికప్పుడు పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కాలువలపై అక్రమ నిర్మాణాల తొలగింపునకు వినతి



కార్యదర్శికి కాలువలపై ఆక్రమణలను చూపుతున్న స్థానికులు

కొత్తూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ కొత్తూరు శారదా నగర్ 8వ వీధిలో ఉన్న కాలువలపై అక్రమ నిర్మాణాలు తొలగించాలని పంచాయతీ కార్యదర్శి సుబాష్‌కు స్థానికులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. వర్షం వస్తే వీధిలో నీరు నిలిచిపోతోందని, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. దీనిపై స్పందించిన కార్యదర్శ సదరు ప్రాంతాలను పరిశీలించారు. సర్వేయర్, వీఆర్వోతో స్థలాలను సర్వే జరిపించి ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అక్రమ నిర్మాణాలు ఉంటే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. లేనిపక్షంతో తాము తొలగించడంతో పాటు నిర్మాణదారులపై చర్యలు కూడా తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తాడి చక్రవర్తి, పందల శ్రీను, మాజీ వార్డు సభ్యుడు వేజర్ల వర్మ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి పైడివాడ అగ్రహారంలో సమస్యలు

సబ్బవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : పైడివాడ అగ్రహారంలోని హౌసింగ్ లే-అవుట్ సందర్శనకు వచ్చిన ఆ శాఖ మంత్రి కొలుసు పార్థసారథికి ఆ గ్రామానికి చెందిన పలువురు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు శీరం అప్పలరాజు, మాజీ ఎంపీటీసీ అక్కిరెడ్డి రామలక్ష్మి, దుర్గినాయుడు తదితరులు మాట్లాడుతూ తమ గ్రామంలో పేదలకు 2018-19లో టీడీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ గృహాలు మంజూరు చేసిందన్నారు. లబ్ధిదారులు కూడా ఇళ్ల నిర్మాణం కూడా చేశారన్నారు. అయితే అప్పట్లో ఇళ్ల పట్టాలు మాత్రం ఇవ్వలేదన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ కనీస వసతులైన తాగునీరు, డ్రైనేజీలు, విద్యుత్ వంటి వాటిని కల్పించలేకపోయిందని వాపోయారు. వైసీపీ ప్రభుత్వం రాజకీయ కక్షతోనే తమ కాలనీ అభివృద్ధికి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. దీంతో నిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. తమ గ్రామంలో 320 ఎకరాల భూములు తీసుకొని స్థానికులైన పేదలకు ఒక్క ఇంటి స్థలం కూడా ఇవ్వలేదని తెలిపారు. సొంత ఇళ్లు లేని పేదలకు ఇంటి స్థలంతో పాటు ఇళ్లు మంజూరు చేయాలని విన్నవించారు. అలాగే, గ్రామంలో సమస్యలన్నింటినీ త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ



స్కూల్ బ్యాగులతో విద్యార్థులు

సబ్బవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : బాటజంగాల పాలెంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రభు త్వం సమకూర్చిన స్కూల్‌బ్యాగులు, బెల్టులను శుక్ర వారం సర్పంచ్ పడాల వెంకటరమణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి, వారికి గుణాత్మక విద్య అందేలా చూడాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం హేమంత్ కుమార్, స్కూల్ కమిటీ ఛైర్మన్ బి.శంకరరావు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

కలపాక జగనన్నకాలనీ వీధి రోడ్లు అధ్వానం

» వర్షాలకు బురదమయం » అడుగు తీసి అడుగు వేయలేకపోతున్న నివాసితులు





ఇటీవల కురుస్తున్న వర్షాలకు చిత్తడిగా తయారైన వీధి రోడ్లు

పరవాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలపాక పంచాయతీ జగనన్న కాలనీలో వీధి రోడ్లు తాజా వర్షాలకు అధ్వానంగా మారాయి. వీటిపై రాకపోకలు సాగించేందుకు కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీ ఏర్పాటై నాలుగేళ్లు గడుస్తున్నా నేటికీ వీధి రోడ్లు, కాలువలు ఏర్పాటు చేయలేదు. దీంతో వర్షాల సమయంలో రహదారులు చిత్తడిగా మారుతున్నాయి. అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంటుంది. ఈగలు, దోమలు వృద్ధి చెంది రాత్రుళ్లు నిద్ర ఉండడం లేదని చెబుతున్నారు. దీనితోడు వాడుకనీరు రోజుల తరబడి నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. రహదారులపై బురద కారణంగా వృద్ధులు, చిన్నపిల్లలు మరింత అవస్థలు పడాల్సి వస్తోంది. అధికారులు ఈ సమస్యలపై తక్షణమే స్పందించి వారంతా కోరుతున్నారు.

ఘనంగా దుర్గమాంబకు పూజలు



దుర్గమాంబను దర్శించుకుంటున్న భక్తులు

సబ్బవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరంలో గల దుర్గమాంబ ఆలయ ఏడో వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు వేకవజాము నుంచి అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఏర్పాటైంది. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

శ్రీనివాసుడికి అష్టోత్తర కలశాభిషేకం



కలశ పూజ చేస్తున్న అర్చకులు

పరవాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఈ.బోనంగి ఫార్మా పునరావాస కాలనీలో గల కొండపై కొలువుదీరిన అభయ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం అష్టోత్తర కలశాభిషేకం నిర్వహించారు. ప్రధానార్చకులు శ్రీహరికృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో 108 కలశాలతో స్వామివారికి అభిషేకాలు జరిపారు. అలాగే, ఆలయ ప్రాంగణంలో గోదాదేవి, లక్ష్మీదేవి అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన జరిగి నలభై రోజులు పూర్తయిన సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు అన్నసమారాధన చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పరవాడ టీడీగా అరుణ్‌కుమార్

పరవాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మండల డిప్యూటీ తహసీల్దార్‌గా అరుణ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా అనకాపల్లి కలెక్టరేట్ నుంచి ఇక్కడికి విచ్చేశారు. గతంలో ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన కె.సురేష్‌నాయుడు కలెక్టరేట్‌లోని స్పందన సెల్‌కు బదిలీ అయ్యారు.

నేడు నియోజకవర్గ స్థాయి టీడీపీ కార్యకర్తల సమావేశం

సబ్బవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తిలోని తాండ్ర పాపారాయుడు కల్యాణ మండపంలో శనివారం టీడీపీ పెందుర్తి నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం జరగనుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గండి ముత్యాలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ఛైర్మన్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశం ఉదయం పది గంటలకు ప్రారంభం కానుందన్నారు. నియోజకవర్గ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు కొరాడ రాజబాబు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

నట్టల నివారణ మందుతో పశువులకు ఆరోగ్యం



గొర్రెకు నట్టల నివారణ మందు పట్టిస్తున్న సిబ్బంది

కశింకోట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపాలెంలోని పశువైద్య కేంద్రం వద్ద గొర్రెలు, మేకలకు శుక్రవారం నట్టల నివారణ మందు వేశారు. ఈ సందర్భంగా మండల పశు వైద్యాధికారిణి డాక్టర్ దయానా మాట్లాడుతూ మూగ జీవాలకు ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఈ మందు వేస్తున్నట్టు చెప్పారు. దీని వల్ల అవి ఆరోగ్యంగా ఉండడమే కాకుండా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు 720 గొర్రెలకు, 80 మేకలకు ఈ మందు వేశామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కర్రి సత్యనారాయణ, ఉల్లిం గల రమేష్‌లతో పాటు వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'విభిన్న ప్రతిభావంతుల ఆరాధ్యుడు హెలెన్ కెల్లర్'



హెలెన్ కెల్లర్ విగ్రహం వద్ద నివాళులు

అనకాపల్లి టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఉడ్‌పేటలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రపల్లి వీరుయాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం హెలెన్ కెల్లర్ 145వ జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి దివ్యాంగులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీరుయాదవ్ మాట్లాడుతూ దివ్యాంగుల ఆరాధ్యుడు హెలెన్ కెల్లర్‌గా పేర్కొన్నారు. యలమర్తి రవి, ఎం.గణేష్, ఎం.గణపతి, మొల్లి చంద్రశేఖర్, నరసింగరావు, కనకరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


పాడేరు: లగిశపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బాలలతో మాట్లాడుతున్న పీడీ


అనంతగిరి: పినకోటలో జరిగిన సీమంతాల్లో పాల్గొన్న సర్పంచ్, తదితరులు

పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలి

» ఐసీడీఎస్ పీడీ ఝాన్సీభాయి

పాడేరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ చిట్టపులి ఝాన్సీభాయి అన్నారు.మండలంలో లగిశపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా కేంద్రం నిర్వహణపై ఆరా తీయ డంతోపాటు పోషకాహారం తనిఖీ, బాలల పూర్వప్రాథమిక విద్యాబోధనను పరిశీలించారు. అలాగే బాలలతో మాట్లాడి వారి పఠనాసక్తిని అంచనా వేశారు. అంగన్‌వాడీ కేంద్రం పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యకర్త ఇంద్రకుమారిని పీడీ అభినందించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు టి.రాజేశ్వరి, డి.లక్ష్మి ఉన్నారు.

అనంతగిరి: మండలంలోని చిలకలగెడ్డ అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీవో ఎం. సుగుణ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న పోషకాహారం పాలు, గుడ్లను పరిశీలించారు. మెనూ ప్రకారం కేంద్రాల్లో భోజనాలు పెట్టాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రీ స్కూల్ విద్యాబోధనపై అడిగితెలుసుకున్నారు. అనంతగిరిలో జరిగిన సెక్టార్ సమావేశంలో గుమ్మకోట, పైనంపాడు, పెదబిడ్డ సెక్టార్ పరిధిలో కార్యకర్తలు ఆన్‌లైన్ నమోదులో నిర్లక్ష్యం వహించడంపై ఆమె అసంతృప్తి వ్యక్తంచేశారు. సూపర్‌వైజర్లు కృష్ణవేణి, లక్ష్మీదేవి, విమలకుమారి, బీపీసీ వెంకటరావు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతాలు

పినకోట అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సిరగం గణేశ్ మాట్లాడుతూ. చిన్నారులు, గర్భిణులు, రక్తహీనత లేకుండా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకుంటే పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సతీశ్‌కుమార్, జె.అప్పలలకొండ, కార్యకర్త పి.కళావతి, రజిని, గౌరీ, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి


సమ్మె కరపత్రాలు విడుదల చేస్తున్న నేతలు, కార్మికులు

అరకులోయ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్‌కోడ్స్ రద్దు చేయాలని, కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని తదితర సమస్యలపై జూలై 9న దేశవ్యాప్త కార్మిక సంఘాలు చేపడుతున్న సమ్మెలోకి జిల్లాలోని ఐటీడీఏ, జీసీసీ పరిధిలోని ఉద్యోగులు, పర్యాటక ప్రాంతాల్లో పని చేస్తున్న కార్మికులు పాల్గొననున్నట్టు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు జె.భగత్‌రామ్, ఐటీడీఏ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దాడి రాజు పేర్కొన్నారు. జీసీసీ, మ్యూజియం, గార్డెన్‌వర్కర్స్ సంస్థల అధికారులకు సమ్మె నోటీసు శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లేబర్‌కోడ్స్ అమల్లోకి వస్తే కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. అ లాగే, రాష్ట్ర ప్రభుత్వం పది గంటల పని విధానాన్ని తేవడం సరికాదన్నారు. ఐటీడీఏలో పనిచేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేసి, వేతనం రూ. 26వేలు అందించాలన్నారు. జీసీసీ వర్కర్స్ యూనియన్ నాయకులు పద్మ, రామచందర్, దాసుబాబు, సత్యారావు, ఐటీడీఏ వర్కర్స్ యూనియన్ నాయకుడు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

డోలీలో ఆస్పత్రికి గర్భిణి తరలింపు

గూడెంకొత్తవీధి, జూన్ 27 (ఆంధ్ర జ్యోతి):మండలంలోని లక్కవరపుపేట పంచాయతీ లింగవరం గ్రామానికి చెందిన గర్భిణీని గిరిజనులు డోలీపై ఆస్పత్రికి తరలించారు. వివరాలివి.. గ్రామానికి రహదారి సదుపాయంలేదు.కేవలం కాలిబాట మాత్రమే ఉన్నది. రోడ్డు సదుపాయం కల్పించాలని గత ఐదేళ్లగా ఆదివాసీలు పాలకులకు మొరపెట్టుకున్నా కనీసం పట్టించుకున్న దాఖలాలులేవు. దీంతో ప్రస్తుతం గిరిజనులు రోగులు, గర్భిణులను డోలీపైనే ఆస్పత్రికి తరలిస్తున్నారు. శుక్రవారం ఉదయం గ్రామానికి చెందిన పాం గి శిరీషకు పురిటి నొప్పులు వచ్చాయి. కుటుంబ సభ్యులు నేరళ్లబంద రహదారి వరకు 4 కిలోమీటర్లు డోలీపై మోసుకుని తీసుకొచ్చారు. అక్కడ నుంచి బైక్‌పై పెదవలస ఆస్పత్రికి తరలించారు. ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఇకనైనా తమ గ్రామానికి రహదారి నిర్మించాలని ఆ గ్రామ గిరిజనులు విజ్ఞప్తి చేస్తున్నారు.


డోలీలో గర్భిణీనికి తరలిస్తున్న గిరిజనులు

విద్యార్థుల సంక్షేమంపై నిర్లక్ష్యం తగదు: ఎమ్మెల్యే


తలారిసింగి పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

పాడేరురూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థుల సంక్షేమంపై ప్రభుత్వం నిర్లక్ష్యంవహించడం తగదని స్థానిక ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. పాడేరు లోని తలారిసింగి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. వసతిగృహంలోవిద్యార్థులుంటున్న గదులను పరిశీలించారు. 432 మంది విద్యార్థులు ఉంటున్న ఈ వసతి గృహంలో మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవరిస్తోందన్నారు.ఈ గదుల్లో పందులు కూడా పడుకోవన్నారు. పూర్తిగా తలుపులు, కిటికీలులేక అధ్వానంగా ఉందన్నారు. శిథిలమైన ఈ భవనంలో ఉండడం ప్రాణాలకే ప్రమాదమని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. అయినా, జిల్లా యంత్రాంగం పట్టించుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. వసతి గృహాలు ఇలా ఉంటే గిరిజన సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖా మంత్రి లోకేశ్, గిరిజన మంత్రి సంధ్యారాణి చెప్పడం సిగ్గుచేటన్నారు. ఈ తనిఖీ చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న టీడబ్ల్యూ డీడీ ఎల్.రజని పాఠశాలకు వెళ్లి ఎమ్మెల్యేతో మాట్లాడారు. పాఠశాల మరమ్మతులకు రూ.75 లక్షలు మంజూరయ్యాయయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు సీదరి రాంబాబు, సూర్యనారాయణ, కన్నాపాత్రుడు పాల్గొన్నారు.

సమస్యలపై డీఎంహెచ్‌వోకు ఏఎన్‌ఎంల వినతి

పాడేరురూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లోవిధులు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం డీఎంహెచ్‌వో టి.విశ్వేశ్వరరావు నాయుడుకు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సమాయ కార్యదర్శి ఎల్.సుందరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం గ్రామ వార్డు సచివాలయాల్లో ఏఎన్‌ఎంల నియామకం చేపట్టిందన్నారు. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా 88 ఏఎన్‌ఎం ఖాళీ పోస్టుల్లో పదోన్నతులు కల్పనకు అధికారులు మెరిట్ లిస్టు ప్రకటించినా, అది సక్రమంగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ వ్యాప్తంగా 68 జీవో ప్రకారం ఏఎన్‌ఎం పోస్టులు ఖాళీలున్నా, రేషనలైజేషన్ పేరిట కేవలం 33 పోస్టులకు కుదించడం సరికాదన్నారు. సచివాలయ ఏఎన్‌ఎంలను గ్రేడ్- 3 నుంచి ఎంపీహెచ్‌ఏ (ఎఫ్)గా పదోన్నతులు కల్పించాలని, సచివాలయ ఏఎన్‌ఎంలను మాతృ శాఖకు విలీనం చేయాలన్నారు. కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రటరీలు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.వి. కుమారి, ప్రధాన కార్యదర్శి పి.తులబొత్తి, అంబిక, కృష్ణ, లక్ష్మి, రాజమని, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


డీఎంహెచ్‌వోకు వినతిపత్రమిస్తున్న ఏఎన్‌ఎంలు

చింతపల్లి ఏడీఏగా తిరుమలరావు


ఏడీఏకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు

చింతపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సబ్ డివిజన్ వ్యవసాయశాఖ సహాయక సంచాలకులు (ఏడీఏ)గా బీవీ తిరుమలరావు నియమితులయ్యారు. తాజా బదిలీల్లో రెండేళ్లపాటు చింతపల్లి ఏడీఏగా పనిచేసిన కంటా జాహ్నవిని యలమంచిలి బదిలీచేయగా ఆమె స్థానంలో శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో పనిచేస్తున్న తిరుమలరావుని నియమించారు. ఈమేరకు శుక్రవారం ఏడీఏగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన రైతుల వ్యవసాయ ద్వారా ఆదాయం పెంపొందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఏడీఏకి జీకేవీధి, చింతపల్లి ఏవోలు మధుసూదనరావు, శ్రీనివాసరావు, సబ్ డివిజన్‌లోని సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

విద్యార్థులకు నాణ్యమైన కిట్లు


విద్యార్థులకు విద్యామిత్ర కిట్ అందజేస్తున్న తహశీల్దార్ రామకృష్ణ

గూడెంకొత్తవీధి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్ల ద్వారా నాణ్యమైన సామగ్రి అందజేస్తోందని స్థానిక తహశీల్దార్ టి. రామకృష్ణ అన్నారు. మండలంలోని గుర్రాళ్లగొంది మోడల్ ప్రైమరీ పాఠశాలను శుక్రవారం తహసీల్దార్ సందర్శించారు. విద్యార్థులకు విద్యామిత్ర కిట్ ద్వారా యూనిఫారం, షూస్ విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామానికి సరైన రహదారిలేదని గిరిజనులు చెప్పడంతో గిరిజన సంక్షేమశాఖ డీఈకి సమస్య తెలిపినట్టు తహశీల్దార్ సమాధానమిచ్చారు. పాఠశాలకు ప్రహరీ గోడ లేని విషయం కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జ్యోతిబాయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నట్టల నివారణ టీకాలు తప్పనిసరి


మత్స్యపురంలో టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏడీ రాజా రవికుమార్

హుకుంపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకలకు నట్టల నివారణ టీకాలు వేయించాలని పశు సంవర్ధక శాఖ ఏడీ రాజా రవికుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కొట్నాపల్లి పంచాయతీ మత్స్యపురం గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 26వతేదీ నుంచి జూలై 10 వరకు నట్ట నివారణ టీకాలు వేస్తారన్నారు. మండలంలోని 33 పంచాయతీల్లోని రైతులు ఈ అవకాశం తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వం ఈ వ్యాక్సిన్లు వేస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి చరణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి సీడీపీవోగా శ్రీదేవి



చింతపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవోగా సీహెచ్. శ్రీదేవి నియమితులయ్యారు. ఇక్కడ సీడీపీవోగా పనిచేసిన జీవీ రమణ నర్సీపట్నం బదిలీచేశారు. ఆమె స్థానంలో వి. మాడుగుల ప్రాజెక్టులో పనిచేస్తున్న శ్రీదేవిని నియమించారు. ఈ మేరకు శుక్రవారం నూతన సీడీపీవో ఇన్‌చార్జి సీడీడీపీవో రామలక్ష్మి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలో చిన్నారులు, బాలింతలు, గర్భిణుల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

అనంతగిరి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో వివిధ ప్రాంతాల్లో ఉపాధ్యాయురాలు సన్యాసమ్మ జనాల మన్ననలు పొందారని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలికల-2 పాఠశాలలోని ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం విధులు నిర్వహిస్తూ.. పదవీవిరమణ చేస్తున్న దల్లి సన్యాసమ్మకు వీడ్కోలు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఎంపీపీ శెట్టి నీలవేణి, వైసీపీ మండల అధ్యక్షుడు సూర్యనారాయణ, హెచ్‌ఎం మంగమ్మ, ఉపాధ్యాయురాలు, తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థుల సేంద్రియ సాగు


ఆర్గానిక్ విద్యార్థులు పండించిన కూరగాయలు

చింతపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆచార్య ఎన్‌జీ రంగా ఆర్గానిక్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు సేంద్రియ పద్ధతిలో కూరగాయలు పండించారు. విద్యాభ్యాసంలో భాగంగా ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మూడో సెమిస్టర్‌లో స్వయంగా పంటల సాగు చేపట్టారు. ఈ ఏడాది కూరగాయల పంటలను ఎంపిక చేసుకున్నారు. పరిశోధన స్థానంలో వివిధ రకాల కూరగాయలను సేంద్రీయ పద్ధతిలో పండించారు. వీటిని విద్యార్థులు స్థానిక మార్కెట్‌లో విక్రయించారు. సేంద్రీయ పంట కావడంతో వీటి కొనుగోలుకు జనాలు ఆసక్తి చూపారు.

ఆర్‌వీనగర్-పాలగెడ్డ రహదారి నిర్మించాలి

» మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు


బాలరాజుకి వినతి పత్రం అందజేస్తున్న గిరిజనులు, ప్రజాప్రతినిధులు

చింతపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అత్యంత అధ్వాన స్థితికి చేరి ఆర్‌వీనగర్-పాలగెడ్డ అంతర్రాష్ట్ర ప్రధాన రహదారి నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు కోరారు. శుక్రవారం సీలేరు, ధారకొండ ప్రాంత గిరిజనులు రహదారి సమస్యపై మాజీ మంత్రికి విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ ఆర్‌వీనగర్-పాలగెడ్డ రహదారిపై హైదరాబాద్, భద్రాచలం, మల్కన్‌గిరి ప్రాంత ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారన్నారు. గత పదేళ్లగా కనీస మరమ్మతులు చేపట్టలేదన్నారు. కొండచరియలు విరిగిపడి నిరాశ్రయులైన చట్రాపల్లి గిరిజనులకు మౌలిక సదుపాయాలు, పక్కా గృహాలు నిర్మించాలన్నారు.సీలేరు సర్పంచ్ దుర్గో, డీసీసీ జిల్లా కార్యదర్శి కారే శ్రీనివాసరావు, దుప్పులవాడ, గుమ్మిరేవుల మాజీ సర్పంచ్ అల్లంకి రాజుబాబు,కాంగ్రెస్ నేతలు మల్లుదొర, వంతల రామచందర్ పాల్గొన్నారు.

వైద్యాధికారులకు బదిలీ

సీలేరు, జూన్ 27 , (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు,ధారకొండ, సప్పర్ల పీహెచ్‌సీల్లో రెండేళ్ళుగా పని చేస్తున్న వైద్యాధికారులకు బదిలీ చేస్తూ అధి కారులు ఆదేశాలు జారీ చేశారు. సీలేరు పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్‌కే మస్తాన్ వల్లీ, కె సౌమ్యలను తెనాలి బదిలీ చేయగా, అలాగే, ధారకొండ పీహెచ్‌సీలోని హిమబిందుకు పెనుగోలు, నాగభూషణానికి నాతవరం పీహెచ్‌సీలకు బదిలీ అయింది. సప్పర్ల పీహెచ్‌సీలోని ఈశ్వర్ సందీప్‌కు కేజీపురం, ప్రసన్నకుమార్‌కు నాతవవరం పీహెచ్‌సీకు బదిలీ చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల క్వార్టర్స్ మరమ్మతులు చేపట్టాలి

పాడేరురూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తలారిసింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది నివాసిత గృహాలు మరమ్మతులకు చర్యలు చేపట్టాలని కోరుతూ ఉపాధ్యాయులు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకువినతిపత్రమిచ్చారు. అలాగే, పాఠశాల సమీపానఉన్న క్వార్టర్స్‌లో ఇతరులు నివాసముంటున్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

డుంబ్రిగుడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండంలోని జైపూర్ కూడలి వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం త్రుటిలో ప్రమాదం తప్పింది. తెలంగాణ రాష్ట్రం నుంచి వచ్చిన పర్యాటకులు అరకు నుంచి చాపరాయి జలవిహా రిని సందర్శనకు ఉదయం బయలు దేరారు. మార్గ మధ్యలో జైపూర్ కూడలిలో ప్రమాదవశాత్తు వారి కారు డివైడర్‌ను ఢీకొని పక్కకు ఒరిగిపోయింది. స్వల్పంగా గాయపడిన కారులో ప్రయాణిస్తున్న వారిని స్థానికులు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గృహ నిర్మాణ బిల్లులు విడుదల చేయాలి


ఐటీడీఏ వద్ద ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

పాడేరురూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పాడేరు ఐటీడీఏ పరిధిలో పీఎం జన్‌మన్ గృహ లబ్ధిదారుల బకాయి బిల్లులు తక్షణమే విడుదల చేయాలని గిరిజన సంఘం గిరిజన సంఘం నాయకులు పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. ఈ మేరకు లబ్ధిదారులు ఐటీడీఏ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అప్పలనర్స మాట్లాడుతూ పాడేరు ఐటీడీఏ పరిధిలో సుమారు 34,570 మంది పీవీటీజీలకు గృహాలు మంజూరు చేశారని, ఒక్కొక్కరికి రూ. 3.39 లక్షలు ప్రభుత్వం కేటాయించిందన్నారు. కానీ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా నిధులు చాలక లబ్ధిదారులు గృహ నిర్మాణాల కోసం అప్పులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. అలాగే, గృహ నిర్మాణ బకాయిలు రూ. 25 కోట్లు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. ప్రతీ లబ్ధిదారుడి ఇంటి నిర్మాణానికి రూ. 10 లక్షలు ఇవ్వాలని, బకాయి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ శాఖ డీఈ స్పందించి మాట్లాడుతూ ఇప్పటికే జన్‌మన్ గృహ లబ్ధిదారులకు బకాయి బిల్లులు రూ. 2.71 కోట్లు విడుదలైనట్టు చెప్పారు. మిగిలిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇవ్వడంతో లబ్ధిదారులు ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు పొద్దు బాలదేవ్, ఎస్.ధర్మన్నపడాల్, ఎల్.సుందరరావు, కొర్రా బాలయ్య, సుడిపల్లి కొండలరావు, కిల్లో సత్యనారాయణ, కొర్రా నర్సయ్య, పాలికి లక్కు, హైమావతి, ఈశ్వరి, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

క్రేన్ బోల్తా పడి డ్రైవర్‌కు స్వల్ప గాయాలు


వలసగెడ్డ వంతెన రక్షణ గోడపై నిలిచిన జెన్‌కోకు చెందిన క్రేన్

సీలేరు, జూన్ 27 , (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ పరిధిలోని వలసగెడ్డ వంతెన వద్ద శుక్రవారం సాయంత్రం క్రేన్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో జెన్‌కో ఉద్యోగి పి. రామ్మోహన్‌కుస్వల్పగాయాలయ్యాయి. గత సెప్టెంబరులో వచ్చిన భారీ వర్షాలకు చెట్లు విరిగిపడి నీటి ప్రవాహానికి కొట్టుకు వచ్చి వలసగెడ్డ వంతెనకు అడ్డంగా నిలిచిపోయాయి. డొంకరాయి జలాశయానికి నీటిని అందించే వాటి ల్లో ఈ వాగు ప్రధానమైంది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో వర్షాలు కురుస్తుండటంతో కొండలపై నుంచి వచ్చే నీటి ప్రవాహానికి అడ్డంకిలేకుండా చెట్లను జెన్‌కో అధికారులు క్రేన్ తీసుకువెళ్లి తొలగిస్తున్నారు. ఈ క్రమంలో ఈ క్రేన్ అదుపు తప్పి వంతెనపై బోల్తా కొట్టింది. గట్టుపై వాహనం నిలిచిపోయింది. గట్టు లేకపోతే క్రేన్ నీటిలో పడి పెనుప్రమాదం జరిగి ఉండేది. ఈ ఘటనలో క్రేన్ ఆపరేటర్ పి. రామ్మోహన్‌కు తలకు స్వల్ప గాయాలు కావడంతో జెన్‌కో ఆసుపత్రికి తరలించి వైద్య సేవలను అందించారు. విషయం తెలుసుకున్న జెన్‌కో అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

పెదకోటకు ఆర్టీసీ బస్సును నడపాలని వినతి

అనంతగిరి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి దేవరాపల్లి మీదుగా పెదకోట వరకు ఆర్టీసీ బస్సును నడపాలని విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ సియ్యారి దొన్నుదొరను విన్నవించినట్టు ఆ గ్రామ సర్పంచ్ సిరగం గణేశ్ శుక్రవారం తెలిపారు.. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి, రెండు నెలల్లో ఆర్టీసీ బస్సును నడిపేవిధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని చెప్పారు. ఈ సర్వీసు నడిపితే జీనబాడు, పినకోట, పెదకోట పంచాయతీలోని సుమారు 30 గ్రామాల గిరిజనులకు మేలు జరగనుందని చెప్పారు.

పరిసరాల పరిశుభ్రతోనే వ్యాధులు దూరం

కొయ్యూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు దరి చేరకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో జీవీడీ ప్రసాద్ సూచించారు. ఎంపీడీవో శుక్రవారం నడింపాలెంను సందర్శించి పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం గ్రామస్థులు తడి, పొడిచెత్త బుట్టలు ఏ మేరకు వినియోగిస్తున్నారనే విషయాన్ని పరిశీలించారు. గ్రీన్ అంబాసిడర్ల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా, డయేరియా తదితర వ్యాధులు సోకకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో నాయుడు, పంచాయతీ కార్యదర్శి సిబ్బంది పాల్గొన్నారు.

జి.మాడుగుల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో ఎస్. డేవిడ్‌రాజు సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని కె.కోడాపల్లి పంచాయతీ కేంద్రంలో నిర్వహించిన పారిశుధ్య కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. తడి, పొడి చెత్త తొలగింపును దగ్గరుండి చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్యంలో ఎపిడమిక్ సీజన్ వస్తున్న నేపథ్యంలో ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎం.చిలకమ్మ, ఎం.వెంకటరమణ, సచివాలయ సిబ్బంది, పెసా కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.


కొయ్యూరు: కె.కోడాపల్లిలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో డేవిడ్‌రాజు

వైభవంగా జగన్నాథుని రథయాత్ర


జగన్నాథస్వామి రథం వద్ద భక్తులు...

ముంచంగిపుట్టు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుగురాయి పంచాయతీ కొండపడ గ్రామంలో శుక్రవారం జగన్నాథ స్వామి రథయాత్రతో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.. ప్రత్యేక పూజల అనంతరం రథయాత్ర నిర్వహించారు. దారిపొడువునా భక్తుల జగనాథుని నామస్మరణతో మారుమోగింది. రథాన్ని లాగేందుకు భక్తులు, యువత పెద్ద ఎత్తున పోటీపడ్డారు.. గిరిజన సంప్రదాయ ప్రకారం.. పూజలను నిర్వహించి, ప్రసాదాలను పంచిపెట్టారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా సర్పంచ్ నరసింగరావు, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మి ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గిరిజనులు భారీగా పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు లేక చిన్నారులు విద్యకు దూరం


ఉపాధ్యాయులను నియమించాలని ఎంఈఓకు వినతి పత్రాన్ని అందిస్తున్న నాయకులు

పెదబయలు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంపీపీ, జీపీఎస్ పాఠశాలలను గిరిజన విద్యార్థి సంఘం నాయకులు మాధవరావు, బాబూజీ శుక్రవారం సందర్శించారు. అనంతరం ఈయా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై ఎంపీడీఓ పూర్ణయ్య, ఎంఈఓ కృష్ణమూర్తికు వినతి పత్రాలను అందించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని బొంగరం పంచాయతీ వంచుర్ల, చింతగరువు, గుల్లేలి పంచాయతీలు, రెంజెలమామిడితోపాటు మరో సుమారు 32 పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేరని తెలిపారు. పాఠశాలలు పునః ప్రారంభమై పదిరోజులు దాటుతున్నా ఉపాధ్యాయులులేక విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుతం 6వ తరగతిలో వేరే పాఠశాలకు చేరే విద్యార్థిలకు టీసీలు రాయడానికి కూడా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారన్నారు. ఈ సమస్యలపై త్వరలోనే జిల్లా స్థాయి అధికారులకు వినతి పత్రాన్ని అందిస్తామన్నారు.

అటవీ హక్కులపై అవగాహనతోనే అభివృద్ధి

డుంబ్రిగుడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అటవీ హక్కు పట్ల అవగాహనతోనే అభి వృద్ధి సాధ్యమని స్థానిక ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సీపీఎఫ్ ఆధ్వర్యాన అటవీ హక్కుల చట్టంపై సదస్సు నిర్వహించారు. అనంతరం జాతీయ రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అడవులను పరిరక్షణతోనే పచ్చదనం సాధ్యమన్నారు.అటవీ ఉత్పత్తులతో చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందవచ్చునన్నారు. సెంటర్ ఫర్ పీపుల్స్ ఫారెస్ట్రీ ప్రోగ్రాం ఆచార్య నాగమణి, గాసి నాయుడు, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పుస్తకాలు పంపిణీ

పాడేరురూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గిరి కైలాస క్షేత్రం ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం పేద విద్యార్థులకు వాసవీక్లబ్ ప్రతినిధులు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి ఉప్పల వెంకటరత్నం, కొట్టగుల్లి రామారావు, వా సవీక్లబ్ ప్రతినిధులు శ్రీనాధు శ్రీను, సత్యవరపు సోమరాజు, వాసవీ క్లబ్ మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు

జీకేవీధి పశువైద్యాధికారిగా లోకుల రమేశ్



గూడెంకొత్తవీధి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి):స్థానిక పశువైద్యాధికారిగాలోకుల రమేశ్ నియమితులయ్యారు. గత ఐదేళ్లగా ఇక్కడ పశువైద్యాధికారి పోస్టు ఖాళీగావున్నది. దీంతో ఇన్‌చార్జ్‌లతో కా లం నెట్టుకొస్తున్నారు. తాజా బదిలీల్లో గొలుగొండ రమేశ్‌ని జీకేవీధి బదిలీ చేశారు.ఈమేరకు ఆయన శుక్రవారం ఇక్కడ విధుల్లో చేరారు.

టీడీపీ అరకు నియోజకవర్గ పరిశీలకుడుగా చిరంజీవినాయుడు

జి.మాడుగుల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అరకు మండల స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకుడిగా జి.మాడుగుల మండలం నుంచి తెలుగుదేశం పార్టీకి చెందిన వి.చిరంజీవి నాయుడును అధిష్టానం నియమించింది. టీడీపీలో పనిచేసే వారికి అధిష్టానం గుర్తిస్తుందనడానికి తన పదవి కేటాయింపేఉదాహరణ ఆయన ఈసందర్భంగా అన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కొయ్యూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నడింపాలెం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు పాంగి కృష్ణమూర్తి కుటుంబ సభ్యులను జీసీసీ మాజీ చైర్మన్ ఎంవీవీ ప్రసాద్ పరామర్శించారు. భార్య నాగమణి, కుమార్తెలు ప్రణీత, రమాదేవిలతో పాటు కుమారుడు నరేంద్రను పరామర్శించి ఓదార్చారు. నర్సీపట్నం జడ్పీటీసీ సభ్యులు సకల రమణమ్మ, బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు అరిమెల రాజు, ఉపాధ్యక్షుడు రీముల చంద్రరావు, గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నేతలు పాల్గొన్నారు.



పార్కులో పనులపై అధికారులతో మాట్లాడుతున్న డీఆర్వో సత్యనారాయణ

అల్లూరి జయంతి వేడుకలకు ముమ్మర ఏర్పాట్లు

» జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణరావు

కృష్ణాదేవిపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): విప్లవవీరుడు అల్లూరి సీతారామ రాజు జయంతి వేడుకలకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా రెవెన్యూ అధికారి వైఎస్.సత్యనారాయణరావు తెలిపారు. స్థానిక అల్లూరి పార్కులో జరుగుతున్న ఏర్పాట్లను నర్సీపట్నం ఆర్డీవో రమణతో కలిసి శుక్రవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ పార్కులో శిథిలమైన నాలుగు ప్రగోడాలను మరమ్మతు చేస్తున్నట్టు చెప్పారు. అలాగే పార్కులో మొక్కలు నాటడంతో పాటు ప్రహరీ, విగ్రహాలు, మందిరాలకు రంగులు వేస్తున్నట్టు ఆయన తెలిపారు. అల్లూరి జయంతికి స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో పాటు డిప్యూటీ స్పీకర్ రఘురామ రాజు, రాష్ట్ర, కేంద్ర మంత్రులు, ఎంపీలు, క్షత్రియ సంఘం నాయకులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ తహసీల్దార్ శ్రీనివాసరావు, వీఆర్వోలు రాజు, పడాల్, టీడీపీ నాయకులు బొడ్డు జమీలు, చిట్టిబాబు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మెనూ కచ్చితంగా అమలు చేయండి

» ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి



చిన్నారులతో ముచ్చటిస్తున్న పీడీ సూర్యలక్ష్మి

బుచ్చెయ్యపేట, జూన్ 27 (ఆంధ్ర జ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్దేశిత మెనూను కచ్చితంగా అమలు చేయాలని ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి ఆదేశించారు. మండలంలోని వడ్డాది-5, 6, లోపూడి అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో స్టాక్ రిజిస్టర్లు, సరకు నిల్వలు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం సిబ్బందితో ఆమె మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చే చిన్నారుల పేర్లతో ఫొటోలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే కేంద్రాలకు పంపించే పోషక పదార్థాలపై ఉండే వినియోగ తేదీలకు సరి చూసుకోవాలన్నారు. కాలం చెల్లిన సరకులు వస్తే తిరిగి పంపించాలని సూచించారు. మెనూ అమలు విషయంలో పొరపాట్లు జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో మంగతాయారు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ భవన పనులు ప్రారంభం



మాడుగులలో అన్న క్యాంటీన్ భవన నిర్మాణ పనులు

మాడుగుల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పేద ప్రజల ఆకలి తీర్చేందుకు మంజూరైన అన్న క్యాంటీన్ భవన నిర్మాణం పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ మేరకు పిల్లర్స్‌కు సంబంధించి గోతులను ఎక్స్‌కవేటర్‌తో తవ్వించారు. ఈ పనులు ప్రారంభం కావడంతో మరో నాలుగైదు నెలల్లో రూ.5కే అన్న క్యాంటీన్‌లో భోజనం చేయవచ్చని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల్లో క్యాంటీన్ ప్రారంభోత్సవం చేస్తామని ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తి హామీ ఇచ్చారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థినులకు ఆర్థిక సాయం



విద్యార్థినులకు ఆర్థిక సాయం అందిస్తున్న పేరెంట్స్ అసోసియేషన్ సభ్యులు

చోడవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ట్రిపుల్ ఐటీకి ఎంపికైన ముగ్గురు పేద విద్యార్థినులకు స్థానిక పేరెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థినులు వేచలపు లక్ష్మి, షేక్ అమీర్ ఉన్నీసా, జొన్నాడ యశశ్రీలకు రూ.5 వేలు చొప్పున పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ పూసర్ల రామారావు, కార్యదర్శి టీవీ రమణ, సభ్యులు పూసర్ల రామారావు, వీరన్న పంతులు, శాకా రమేశ్, పసుమర్తి సీతారామయ్య, డీఎస్ ప్రసాద్, వజల ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు

ఫీల్డ్ అసిస్టెంట్‌పై దివ్యాంగుల ఫిర్యాదు



సూపర్‌వైజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

చీడికాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు పనులు కల్పనలో ఇబ్బందులు పెడుతున్న ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ పర్యవేక్షకుడు శ్రీనివాస్‌కు ఖండివరం గ్రామానికి చెందిన దివ్యాంగులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగుల్లో శ్రీరంరెడ్డి శ్రీరామ్మూర్తి, కూండ్రపు గుణశేఖర్, పెద్దింటి రామలింగస్వామి, వేచలపు కన్నబాబు, లెక్కల అప్పలనాయుడు, సూరెడ్డి సూర్యనారాయణ, పప్పల కొండబాబు, దోకల అప్పలనాయుడు మాట్లాడుతూ గ్రామసభలో పంచాయతీ కార్యదర్శి దివ్యాంగ గ్రూపునకు గ్రామ సమీపంలోనే పని కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కి చెప్పినా అమలు చేయలేదన్నారు. గ్రామం నుంచి సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలో పని కల్పించడం జరిగిందన్నారు. దీనిల్ల తాము ఉదయాన్నే నడిచి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు స్పందించి ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని, దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

ఒకే భవనంలో మూడు కార్యాలయాలు

డీఎల్‌పీవో, ఉపాధి ఏపీడీ, డీడీవో ఆఫీసులు ఒకేచోట!

అందుబాటులో డివిజన్ స్థాయి అధికారులు

పాత మునిసిపల్ కార్యాలయంపై సిద్ధం చేసిన అధికారులు

నర్సీపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పాత మునిసిపల్ కార్యాలయంపై అంతస్తులో మూడు డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, డివిజన్ పంచాయతీ అధికారి అధికారి, డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాలు ఒకే ఆవరణలోకి తరలిస్తున్నారు. 26వ వార్డులో ఉన్న పాత మునిసిపల్ కార్యాలయం ఈ భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో గచ్చపువీధి, అయ్యన్నపాలెంకి సంబంధించి (23, 24, 25, 26 వార్డు) రెండు సచివాయలు నిర్వహిస్తున్నారు. తాజాగా మూడు డివిజనల్ కార్యాలయాలు కూడా అదే భవనంలో ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా పరిషత్ సీఈవో గత నెలలో సందర్శించి మూడు ఆఫీసులు ఏర్పాటు చేయడానికి అంగీకరించారు. భవనం మరమ్మతులకు రూ.5 లక్షలు నిధులు మంజూరు చేశారు. భవనం మరమ్మతులు, రంగులు, మూడు ఆఫీసులకు ఏసీలు, ఫర్నిచరు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం ఏర్పాటు చేస్తున్నారు.

ఇప్పటివరకు డీఎల్‌పీవో కార్యాలయం బలిఘట్టంలో, డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయం పాత మునిసిపల్ కార్యాలయం పై అంతస్తులో, మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ఏపీవో కార్యాలయంలోనే ఒక గదిలో ఏపీడీ కార్యాలయం నిర్వహించేవారు. గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభతరం చేయడానికి, పరిపాలనా సౌలభ్యం కోసం మూడు డివిజనల్ కార్యాలయాలు ఒకచోట ఉండటం మంచిదని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. ప్రభుత్వం డివిజినల్ అభివృద్ధి అధికారి (డీడీవో)కు విస్తృత అధికారాలు కట్టబెట్టింది. డీడీవో కంట్రోల్‌లోనె డీఎల్‌పీవో, ఏపీడీలు పని చేస్తారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు డీడీవో పరిధిలోకి తీసుకు వచ్చింది. పంచాయతీ ఎన్నికల పర్యవేక్షణ, రిజర్వేషన్లు కూడా డీడీవోనే చూసుకుంటారు. సీఈవో అనుమతితో ఎంపీడీవో సెలవు తీసుకోవల్సి వచ్చేది. ఇప్పుడు డీడీవో అనుమతి ఇస్తే సరిపోతుంది. గ్రామీణ ప్రజలకు ఉపయోగపడే కార్యాలయాలు నర్సీపట్నంలోనే ప్రజలకు అందుబాటులోకి రావడంపై హర్షం వ్యక్తమవుతోంది.



మూడు కార్యాలయాలకు కేటాయించిన పాత మునిసిపల్ కార్యాలయం భవనం ఇదే... (ఇన్‌సెట్‌లో) డీఎల్‌పీవో ఆఫీసు గది

వైభవంగా జగన్నాథస్వామి రథోత్సవాలు





చోడవరంలోరథయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజు... మాడుగుల రథయాత్రలో పాల్గొన్న భక్తజనం

చోడవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేశవస్వామి జగన్నాథస్వామి దశావతారాల ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులతో శుక్రవారం సాయంత్రం రథయాత్రను ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈవో సత్యనారాయణ, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, నాయకులు గోకివాడ కోటేశ్వరరావు, చీపురుపల్లి సూర్యనారాయణ, కందర్ప రమణమూర్తి, గూనూరు సురేశ్, సకురు కోటేశ్వరరావు, అర్చకులు సుదర్శన సీతారామాచార్యులు, ఉపాధ్యాయుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాడుగులలో...

మాడుగుల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జగన్నాథస్వామి రథోత్సవ కార్యక్రమాలు శక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటల నుంచి ఆలయంలో జగన్నాథునికి పత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులుపాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి ప్రధాన ఆలయం నుంచి నూకాలమ్మ కాలనీ, ఇంద్రజ్యొమ్నంకు జగన్నాథుని రథాన్ని ఊరేగింపుగా తీసుకువెళ్లారు. వచ్చే నెల 7వ తేదీ వరకు స్వామివారు దశావతారాల్లో భక్తులకు దర్శనం ఇస్తారని ఆలయ ఛైర్మన్ బొడ్డేటి ఆదినారాయణ, అర్చకుడు పండా నూకరాజు తెలిపారు. కాగా, స్వామివారి రథం లాగేందుకు అధిక సంఖ్యలో భక్తులు చేరుకున్నారు. ఎక్కడ ఇబ్బందులు తలెత్తకుండా ఎస్ఐ జి.నారాయణరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అంతకు ముందు స్వామివారిని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దర్శించుకున్నారు.

ఆపరేషన్ కగార్‌తో మారణకాండ వద్దు

» సీపీఐ జిల్లా కార్యదర్శి రామునాయుడు

కృష్ణాదేవిపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక గిరిజన కుటుంబాల మరణకాండను చేయవద్దని సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు డిమాండ్ చేశారు. అల్లూరి పార్కులో శుక్రవారం నిర్వహించిన సీపీఐ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను పొట్టన పెట్టుకుంటున్నదన్నారు. మావోయిస్టులతో చర్చలు జరపాలని, ఆపరేషన్ కగార్‌ను ఆపాలని డిమాండ్ చేశారు. దీనిపై మేధావులు, విద్యార్థులు పెదవి విప్పాలనికోరారు. అలాగే స్మార్ట్ మీటర్ల పేరుతో అధిక బిల్లుల భారాన్ని ప్రజలపై మోపడానికి కార్పొరేట్ వ్యక్తులతో కేంద్రం ఒప్పందం కుదుర్చుకున్నదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గురుబాబు, మేకా సత్యనారాయణ, జి.రాధాకృష్ణ, డి.భవాని, మేకా భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

జనసేన నేత షేక్ రసూల్ సస్పెన్షన్

కేజీబీవీ ప్రిన్సిపాల్ పట్ల అనుచిత ప్రవర్తనతో చర్యలు

చోడవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వడ్డాది కస్తూర్బాగాంధీ స్కూల్ ప్రిన్సిపాల్ కోసూరి అన్నపూర్ణ పట్ల అనుచితంగా ప్రవర్తించిన ఘటనకు సంబంధించి బుచ్చెయ్యపేట మండలం వడ్డాదికి చెందిన జనసేన నేత షేక్ రసూల్‌ను పార్టీ నుంచి తొలగిస్తున్నట్టు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు శుక్రవారం రాత్రి ఓ ప్రకటనల తెలిపారు. వడ్డాది కేజీబీవీ ప్రిన్సిపాల్ అన్నపూర్ణకు రసూల్ గురువారం బెదిరింపులతో పాటు హెచ్చరికలు జారీ చేయడం, శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఆమె పట్ల అనుచితంగా ప్రవర్తించిన తీరు జనసేన ఆశయాలకు వ్యతిరేకంగా ఉందని ఆయన పేర్కొన్నారు. దీనిపై సమగ్ర సమాచారం సేకరణ అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు ఆదేశాల మేరకు రసూల్‌ను పార్టీ నుంచి తొలగించామని వెల్లడించారు.

పశు వ్యాధుల నివారణకు చర్యలు

రోలుగుంట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పశు వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పశు వైద్యాధికారి నూకేశ్వరరావు చెప్పారు. శుక్రవారం గొర్రెలు, మేకలకు వ్యాక్సిన్ అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 24 పంచాయతీల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ వ్యాక్సిన్ అందించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వర్షాకాలంలో గొర్రెలు, మేకలకు వ్యాధులు ప్రబలకుండా నివారణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పెంపకందారులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సుర్ల రామకృష్ణ, పాల సంఘం అధ్యక్షుడు రుత్తల శ్రీనివాసరావు, స్థానిక నాయకుడు సత్తిబాబు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలని నిరసన

మాకవరపాలెం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగుపాలెం గ్రామంలో ఉపాధి పనులు సక్రమంగా కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కూలీలు నిరసన తెలిపారు. అలాగే వారం రోజుల పాటు ఉపాధి పనులు చేయించుకొని నాలుగు రోజులు కూలి డబ్బులు మాత్రమే ఇస్తున్నారని వారు ఆరోపించారు. అంతేకాకుండా వారంలో పూర్తి స్థాయిలో పనులు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు పనులు సక్రమంగా కల్పించాలని, పూర్తి స్థాయిలో కూలి ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.

చెట్టు కొమ్మ విరిగిపడి కారు ధ్వంసం

నర్సీపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టర్ కార్యాలయం వెనుక శుక్రవారం భారీ కానుగ చెట్టు కొమ్మలు విరిగి రెండు కార్లపై పడ్డాయి. దీంతో ఒక కారు ముందు భాగంగా పూర్తిగా దెబ్బతింది. నర్సీపట్నం డివిజనల్ సర్వే అధికారి బంగారుదేవి కారుపై చెట్టు కొమ్మ పడడంతో ముందు భాగం మొత్తం ధ్వంసమైంది. మరో కారుపై చిన్న కొమ్మలు పడడంతో పెద్దగా నష్టం జరగలేదు. తరువాత కట్టర్ సహాయంతో చెట్టు కొమ్మను ముక్కలు చేసి కారును బయటకు తీశారు.

తెరిపిచ్చిన వర్షం

మాడుగుల రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం వర్షం తెరిపిచ్చింది. మూడు రోజులుగా తేలికపాటి, మోస్తరు వర్షం పడుతూనే ఉంది. శుక్రవారం ఎక్కడా వర్షం జాడ కానరాలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు దుక్కులు పట్టి నారుమడులు సిద్ధం చేశారు. వరి విత్తనాలు చల్లే పనులు రైతులు చేపట్టారు.

మునిసిపల్ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి

» సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు



కార్మికులతో మాట్లాడుతూ సీపీఎం నేత నరసింగరావు

నర్సీపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు కోరారు. సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఇంజనీరింగ్, నీటి సరఫరా, వీధి దీపాలు విభాగాల సిబ్బందికి శుక్రవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి పనిచేస్తున్నా పర్మినెంట్ చేయకుండా ఔట్‌సోర్సింగ్ పేరుతో కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని విమర్శించారు. కార్పొరేట్లకు సేవలు అందిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కార్మికులను కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ నాయకులతో ప్రభుత్వం చర్చించి తక్షణమే డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఎ.రాజు పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటికే రేషన్ సరకులు



మేడివాడలో వృద్ధులకు రేషన్ అందిస్తున్న తహసీల్దార్

రావికమతం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో దివ్యాంగులు, 65 ఏళ్లు దాటిన వృద్ధులకు ఇళ్లకే తీసుకువెళ్లి రేషన్ సరకులు అందిస్తున్నామని తహసీల్దార్ ఎస్వీ.అంబేడ్కర్ చెప్పారు. మండలంలోని మేడివాడ గ్రామంలో వృద్ధులు, దివ్యాంగుల ఇంటికి వెళ్లి సరకులు అందించే కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 65 ఏళ్లు దాటిన రేషన్ కార్డుదారులు 2,974 మంది ఉండగా శుక్రవారం సాయంత్రానికి 1,168 మందికి మాత్రమే ఇళ్లకు రేషన్ సరకులను డీలర్లు అందజేశారన్నారు. సమయం తక్కువగా ఉన్నందున వృద్ధులకు ఈ నెల 30లోగా రేషన్ సరకులను అందజేయాలని డీలర్లకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌టీ టి.ఈశ్వరావు, డిపో డీలర్ సింగం శెట్టి మహేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా చెత్తను సేకరించండి: ఈవోపీఆర్డీ

రావికమతం, జూన్ 27 (అంధ్రజ్యోతి): గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లు ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించాలని ఈవోపీఆర్డీ సీతారామస్వామి ఆదేశించారు. మండలంలోని గర్నికం గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. అలాగే గ్రామంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వీధులను పరిశుభ్రం చేయడంతో పాటు ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించాలని సూచించారు. ఈ విషయంలో పంచాయతీ కార్యదర్శి, గ్రీన్ అంబాసిడర్లు అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా చెత్త నుంచి వర్మీకంపోస్టు ఎరువును తయారు చేసి పంచాయతీకి ఆదాయం సమకూర్చుకుంటున్న కార్యదర్శి స్వామిని, సిబ్బందిని అభినందించారు.

రైవాడలో 103 మందికి కంటి పరీక్షలు



రోగులకు నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

దేవరాపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైవాడ గ్రామంలో శుక్రవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సామాజిక వారధి స్వచ్ఛంద సంస్థ, శంకర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 103 మందికి నేత్ర పరీక్షలు చేశారు. వీరిలో 20 మందిని కంటి ఆపరేషన్లు అవసరమని వైద్యులు గుర్తించారు. కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ ఎ.రమణ, సభ్యులు చల్లా నానాజీ, నాయుడు, శంకరు ఫౌండేషన్ మేనేజర్ చంద్రశేఖర్, ఎస్.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ఎంపీడీవో విచారణ

నాతవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొలుగొండపేట గ్రామంలో ఉపాధి పనులపై వచ్చిన ఫిర్యాదు మేరకు ఎంపీడీవో ఉషశ్రీ శుక్రవారం విచారణ చేపట్టారు. పనులకు రానివారికి మేట్లు మస్తర్లు వేస్తున్నారని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. ఈ మేరకు ఎంపీడీవో గొలుగొండపేట వచ్చి కొంతసేపు విచారణ చేశారు. క్షేత్ర స్థాయిలో విచారణ చేసి తప్పుడు మస్తర్లు వేసింది, లేనిది తెలుసుకుంటానని ఈ సందర్భంగా ఎంపీడీవో చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీవో కొండాజీ తదితరులు పాల్గొన్నారు.

తుని-నర్సీపట్నం మార్గంలో జంగిల్ క్లియరెన్స్

నాతవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తుని-నర్సీపట్నం రహదారికి ఇరువైపులా జనసేన పార్టీ నాయకులు శుక్రవారం జంగిల్ క్లియరెన్స్ పనులు చేశారు. దీంతో ప్రయాణికుల కష్టాలు తీరుతాయని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అద్దేపల్లి గణేశ్, అప్పన్న దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వే ఉప తహసీల్దార్‌గా త్రిమూర్తులు



కె.కోటపాడు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండల భూ సర్వే ఉప తహసీల్దార్‌గా జె.త్రిమూర్తులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎలమంచిలి నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చిన త్రిమూర్తులు గతంలో ఎన్నికల అధికారిగా పనిచేశారు. ఇక్కడ సర్వే ఉప తహసీల్దార్‌గా పనిచేస్తున్న బి.సూరి ఎస్.రాయవరం బదిలీపై వెళ్లారు. ప్రజల సహకారంతో భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా డీటీ త్రిమూర్తులు తెలిపారు.

బహిరంగ మల విసర్జన నిరోధించాలి

రావికమతం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏ గ్రామంలోనూ బహిరంగ మల విసర్జన జరగకుండా నిరోధించాలని ఎంపీడీవో కె.వెంకన్నబాబు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఇందులో భాగంగా గ్రామాల్లో పారిశుద్యం లోపించకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ శివారులో రోడ్లకు ఇరువైపులా బహిరంగ మల విసర్జన జరగకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తాగునీటి పథకాలలో క్లోరినేషన్ చేయించాలన్నారు. పంచాయతీకి చెందిన ఆస్తును జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు. ఈ నెల 30 నుంచి జూలై 2వ తేదీ వరకు నర్సీపట్నంలో నిర్వహించనున్న మహిళ సర్పంచుల శిక్షణకు మండలంలోని సభ్యులకు సమాచారం ఇచ్చి కార్యక్రమానికి హాజరయ్యేలా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సీతారామస్వామి తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణకే నట్టల నివారణ మందులు

చీడికాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నులి పురుగుల నివారణకే నట్టల నివారణ మందులు ఇస్తున్నామని పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ వి.చిట్టినాయుడు చెప్పారు. మండల కేంద్రంలో జరుగుతున్న నట్టల నివారణ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సలహాలు, సూచనలు అందించారు. అలాగే చీడికాడతో పాటు ఎల్‌బి.పట్నం, తురువోలు గ్రామాల్లో నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు.ఈ మూడు గ్రామాల్లో 80 గొర్రెలు, 375 మేకలకు ఈ మందులు పంపిణీ జరిగిందని పశు వైద్యాధికారి రాఘవమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వవైద్య సిబ్బంది మనోజ్, సంతోశ్, రాజేశ్, నాయకులు పాల్గొన్నారు.

ఆర్ఎస్‌కేల్లో విత్తనాల పంపిణీ

చీడికాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): చీడికాడ, జేబీపురం రైతు సేవా కేంద్రం వద్ద శుక్రవారం సర్పంచ్ గొల్లవిల్లి చిన్నమ్మలు, కోనాం జలాశయం ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కొట్యాడ చిన్నంనాయుడు చేతులమీదుగా రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధర్మిశెట్టి కొండబాబు, సిరసపల్లి జగ్గారావు, తాతారావు, సిబ్బంది పాల్గొన్నారు.

పశు వైద్యాధికారిణిగా పద్మజ బాధ్యతలు



బుచ్చెయ్యపేట, జూన్ 27 (ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రంలోని పశు వైద్యశాల అధికారిణిగా పద్మజ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సామాజిక బదిలీల్లో భాగంగా మునగపాక మండలం నాగులాపల్లి నుంచి ఆమె ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన పశు వైద్యాధికారిణిగా ఉమామహేశ్వరి అచ్యుతాపురం మండలం దోసూరు పశువుల ఆసుపత్రికి బదిలీ అయ్యారు. నూతన పశు వైద్యాధికారిణి పద్మజ మాట్లాడుతూ అన్ని రకాల పశువులకు వైద్య సేవలు అందిస్తానని, నిర్దేశిత సమయాలలో అందుబాటులో ఉంటానని తెలిపారు

నాడు వెలవెల.. నేడు కళకళ

సర్పంచ్ చొరవతో ప్రభుత్వ పాఠశాలకు పూర్వవైభవం


తరగతి గదిలో విద్యార్థుల సందడి

» ఆరేళ్ల క్రితం విద్యార్థులు లేక శెట్టిపాలెం యూపీ స్కూల్‌ను మూసివేసిన అధికారులు
» రెండేళ్ల తరువాత సర్పంచ్‌గా ఎన్నికైన రామునాయుడు
» గ్రామస్థుల సహకారంతో పాఠశాల పునరుద్ధరణ
» ప్రైవేటు స్కూళ్ల నుంచి ప్రభుత్వ పాఠశాలలో చేరికలు
» ఈ ఏడాది 63కు చేరిన విద్యార్థుల సంఖ్య
» ఒకే టీచర్ ఉండడంతో గ్రామపెద్దల సహకారంతో ఇద్దరు వలంటీర్ల నియామకం
» సొంత నిధులతో డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు
» విద్యార్థులకు ఆటోలో ఉచిత రవాణా సదుపాయం
» వచ్చే ఏడాది విద్యార్థుల సంఖ్య వందకు చేర్చడమే లక్ష్యం


శెట్టిపాలెం యూపీ స్కూల్లో ఈ ఏడాది చేరిన 33 మంది విద్యార్థులతో సర్పంచ్, గ్రామపెద్దలు, టీచర్లు

మాకవరపాలెం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని శెట్టిపాలెంలో వున్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు పంచాయతీ సర్పంచ్ చొరవతో పూర్వ వైభవం వచ్చింది. గత ప్రభుత్వ హయాంలో రెండేళ్లపాటు మూతపడిన పాఠశాలను తిరిగి వినియోగంలోకి తీసుకురావడానికి ఆయన తీవ్ర కృషి చేశారు. ప్రభుత్వ పాఠశాలలో ఉండే సదుపాయాలు, విద్యార్థులకు అమలుచేస్తున్న పథకాల గురించి వివరించి, పిల్లలను తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా గ్రామస్థులకు అవగాహన కల్పించారు. దీంతో ఏటేటా ప్రవేశాలు పెరుగుతూ, ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య 63కు చేరింది.

మండలంలోని శెట్టిపాలెం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో గతంలో వంద మందికి పైగా విద్యార్థులు ఉండేవారు. గ్రామంలో ప్రైవేటు పాఠశాల ఏర్పాటు కావడం, ప్రభుత్వ పాఠశాలలో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు లేకపోవడంతో పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చేర్పించడం మొదలుపెట్టారు. 2019లో ఐదుగురు మాత్రమే విద్యార్థులు వుండడంతో ప్రభుత్వం పాఠశాలను మూసివేసింది. తరువాత పునరుద్ధరణకు విద్యా శాఖ అధికారులు ఎటువంటి కృషి చేయలేదు. 2021లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా గెలుపొందిన అల్లు రామునాయుడు, గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను తెరిపించాలని నిశ్చయించుకున్నారు. మండల విద్యా శాఖ అధికారులతో మాట్లాడి, పాఠశాలను పునఃప్రారంభించాలని, ఇందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. గ్రామంలో బడిఈడు పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి 2021-22లో పది మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. వీరిలో సర్పంచ్ కుమార్తె కూడా వుంది. దీంతో విద్యా శాఖ అధికారులు ఒక టీచర్‌ను నియమించారు. తరువాత ప్రతి ఏటా విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. గత విద్యా సంవత్సరంలో 30 మందికిపైగా విద్యార్థులు వున్నారు. ఈ సంఖ్యను మరింత పెంచడానికి సమీప గ్రామాల్లో కూడా విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. దీంతో ఈ ఏడాది కొత్తగా 33 మంది విద్యార్థులు చేరారు. ఈ ఏడాది మొత్తం 63 మంది విద్యార్థులు వున్నారు. అయితే ప్రాథమికోన్నత పాఠశాల అయినప్పటికీ ఒక్క టీచర్ మాత్రమే వుండడంతో గ్రామ పెద్దల సహకారంతో నిధులు సమకూర్చి ఇద్దరు వలంటీర్లను ఏర్పాటు చేశారు. సర్పంచ్ సొంత నిధులతో డిజిటల్ కంప్యూటర్ స్క్రీన్‌ను వితరణ చేశారు. స్థానిక ఎమ్మెల్యే, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ద్వారా రూ.20 లక్షలు మంజూరు చేయించి ప్రహరీగోడతోపాటు మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం ఆటోను సమకూర్చి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు.

వంద మందిని చేర్పించడమే లక్ష్యం



గతంలో ఈ పాఠశాలలో చదువుకొని ఎంతో మంది ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు పొందారు. కానీ ప్రైవేటు పాఠశాలలు రావడం, విద్యా శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా మా గ్రామంలోని పాఠశాల మూతపడింది. నేను సర్పంచ్ అయిన తరువాత పాఠశాలను తెరిపించడానికి నా వంతు కృషి చేశాను. తొలుత నా కుమార్తెను పాఠశాలలో చేర్పించాను. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి, ప్రైవేటు స్కూళ్ల నుంచి తిరిగి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా అవగాహన కల్పించాను. నా కృషి ఫలించింది. ఈ ఏడాది 63 మంది విద్యార్థులు వున్నారు. వచ్చే ఏడాది ఈ సంఖ్యను వందకు చేర్చడమే లక్ష్యం

- అల్లు రామునాయుడు, సర్పంచ్, శెట్టిపాలెం గ్రామం

ఇళ్ల నిర్మాణంలో నాణ్యత లేదు: మంత్రి పార్థసారథి

సబ్బవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి కొలుసు పార్థసారథి శుక్రవారం మండలంలోని పైడివాడఅగ్రహారంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ లే-అవుట్‌ను, నిర్మించిన ఇళ్లను పరిశీలించారు. వినియోగిస్తున్న మెటీరియల్, నిర్మాణ పనుల్లో నాణ్యతను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యత లేని మెటీరియల్‌ను వినియోగించవద్దని గృహనిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం ఇళ్ల లబ్ధిదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వ నిర్వాకం కారణంగా ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత లోపించిందని ఆరోపించారు. ఇళ్ల నిర్మాణంలో ఒక పద్ధతి పాటించకుండా ఇష్టానుసారం పనులు చేపట్టి, పూర్తి చేయకుండానే నిధులు డ్రా చేసుకున్నారని విమర్శించారు. లేఅవుట్ల అభివృద్ధి, ఇళ్ల నిర్మాణాల్లో జరిగిన అవకతవకలపై విచారణ చేయిస్తామన్నారు. ఇక్కడి లేఅవుట్లలో మిగిలి ప్లాట్లను స్థానిక లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ, పేదలకు ఇళ్ల స్థలాల కోసం గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన భూ సేకరణలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఇళ్లు నిర్మించకుండానే బిల్లులు డ్రా చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పెందుర్తి నియోజకవర్గం ఇన్‌చార్జి గండి బాబ్జీ, రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, హౌసింగ్ పీడీ సత్తిబాబు, సీఈ కృష్ణయ్య, ఈఈ శ్రీనివాసరావు, డీఈఈ సూర్యారావు, ఇతర అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

రక్తమోడిన రహదారి

... 5వ పేజీ తరువాయి

చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కన్నూరు లక్ష్మి భర్త వరహాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

కాగా జమాదులపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి ప్రగాఢ సంతాపం తెలిపారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వరలక్ష్మికి మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని పోలీసు, రవాణా శాఖల అధికారులను ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో టీచర్ మృతి

... 5వ పేజీ తరువాయి


సంఘటన స్థలంలో మృతిచెందిన కృష్ణమూర్తి

ఎదురుగా వస్తున్న బైక్ కారును ఓవర్ టేక్ చేసే క్రమంలో బలంగా ఢీకొన్నది. దీంతో కృష్ణమూర్తి గాల్లోకి ఎగిరి, రోడ్డుపై పడిపోవడంతో తలకు, ముఖానికి బలమైన గాయాలయ్యాయి. తీవ్రరక్తస్రావంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతనిని ఢీకొన్న బైక్‌కు నడుపుతున్న చోద్యం గ్రామానికి చెందిన కన్నారి నిషి, వెనుక కూర్చున్న చింతా ప్రదీప్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం గురించి తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి వచ్చి కృష్ణమూర్తి మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరు అయ్యారు. సమాచారం అందుకున్న గొలుగొండ ఎస్ఐ రామారావు, కృష్ణాదేవిపేట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడు వెంకట కృష్ణమూర్తికి భార్య నాగమణి, ఇద్దరు కూమార్తులు, ఒక కుమారుడు ఉన్నారు. కృష్ణాదేవిపేట ఎస్ఐ వై.తారకేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కదిలిన జగన్నాథుని రథం

» భక్తి శ్రద్ధలతో ఘనంగా రథయాత్ర


రథోత్సవాన్ని పారంభిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ


గవరపాలెంలో సాగుతున్న రథయాత్ర

అనకాపల్లి టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జగన్నాథస్వామి రథయాత్ర శుక్రవారం పట్టణంలో అంగరంగ వైభవంగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొని స్వామివారి రథాన్ని ఉత్సాహంతో లాగారు. అంతకుముందు ఉదయం అగ్గిమర్రిచెట్టు వద్ద గల జగన్నాథస్వామి ఆలయంలో జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రాదేవిల ఉత్సవమూర్తులకు అర్చకుడు బి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పదిన్నర గంటలకు ఉత్సవమూర్తులను ప్రత్యేక రథంపైకి తీసుకువచ్చి అలంకరించారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ రథోత్సవాన్ని ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రారంభమైన రథయాత్ర గవరపాలెంలో పలు వీధులగుండా సాగి మెయిన్‌రోడ్డుకు చేరుకుంది. వన్ వే ట్రాఫిక్ డౌన్, వేగివీధి, చింతావారివీధి, చిననాలుగురోడ్ల జంక్షన్, స్టేషన్‌రోడ్డు మీదుగా రాత్రికి గూడ్స్‌షెడ్డు వద్ద గల ఇంద్రదుమ్న మందిరానికి చేరుకుంది. రథంలో నుంచి ఉత్సవమూర్తులను బయటకు తీసుకువచ్చి వేదికపై ఉంచి పూజలు చేశారు. ఆలయ చైర్మన్ దాడి బుజ్జి, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ సుధారాణి, ఆలయ ఈవో బి.మురళీ, పాలకవర్గ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో తహశీల్దార్ల కొరత

... 5వ పేజీ తరువాయి

తహశీల్దార్లను నియమించాల్సి ఉంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఏకంగా ఎనిమిది మంది తహశీల్దార్ల కొరత ఏర్పడడంతో పాలన ముందుకుసాగడం లేదనే వాదన ఉంది. చింతపల్లి, జి.మాడుగుల, అనంతగిరి, డుంబ్రిగుడ, ముంచంగిపుట్టు, పెదబయలు, హుకుంపేట మండలాలకు పూర్తిస్థాయి తహశీల్దార్లు లేరు. అల్లూరి జిల్లా కలెక్టరేట్‌లో ఒక సూపరింటెండెంట్ పోస్టు ఖాళీగా ఉంది. ఇన్‌చార్జులు ఉన్న మండలాల్లో అనేక ఇబ్బందులు వస్తున్నాయి. కనీసం విద్యార్థులకు ధ్రువపత్రాలు కూడా సకాలంలో జారీకావడం లేదనే విమర్శలు ఉన్నాయి. విశాఖపట్నం జిల్లా నుంచి అనకాపల్లికి బదిలీ అయిన ఇద్దరూ అక్కడ చేరలేదు. దీనికితోడు మరో ఖాళీ ఉంది. దీంతో అనకాపల్లి జిల్లాలో మూడు ఖాళీలు ఉన్నట్టుగా గుర్తించారు. ఇదిలావుండగా ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న తహశీల్దార్లలో కొద్దిమందికి డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు లభించే అవకాశం ఉంది. అప్పుడు తహశీల్దార్ పోస్టులు మరికొన్ని ఖాళీ అవుతాయి. ఈలోగా ప్రస్తుతం ఖాళీగా ఉన్న మండలాల్లో సీనియర్ డీటీలకు అడహాక్ పదోన్నతులు ఇస్తే పాలన సజావుగా సాగుతుంది. ఇందుకు మూడు జిల్లాల కలెక్టర్లు సమావేశమై నిర్ణయం తీసుకోవల్సి ఉంది. అయితే పలు కారణాల వల్ల జాప్యం జరుగుతోందంటున్నారు.

జ్వరాల విజృంభణ

... 5వ పేజీ తరువాయి

రక్త నమూనాలు సేకరించి మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయగా 259 మందికి పాజిటివ్ వచ్చింది. ఈ ఏడాది జూన్ 26వ తేదీ నాటికి జిల్లాలో 1,64,456 మంది నుంచి రక్తనమూనాలు సేకరించి మలేరియా నిర్ధారణ పరీక్షలు చేశారు. వీరిలో 216 మందికి పాజిటివ్ ఉన్నట్టు రిపోర్టులు వచ్చాయని జిల్లా మలేరియా అధికారి వరహాలు దొర తెలిపారు. వైరల్ జ్వర బాధితులు పెరగడంపై అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. జ్వరంతో ఆస్పత్రి ఓపీకి వస్తున్న వారిలో అత్యధికులకు సాధారణ జ్వరాలుగానే నిర్ధారణ అవుతున్నాయని తెలిపారు.

లోసింగిలో స్కూల్ ఏర్పాటుకు చర్యలు

... 5వ పేజీ తరువాయి

పిల్లలు 30 మంది వరకు వున్నారని, రోజూ ఐదు కిలోమీటర్ల దూరంలో వున్న వై.బి.పట్నం పాఠశాలకు వెళ్లిరావడానికి ఇబ్బందిగా వుండడంతో పలువురు చదువుకు దూరమయ్యారని చెప్పారు. డీఈఓ స్పందిస్తూ.. నివాసేతర ప్రత్యేక శిక్షణ కేంద్రం (స్కూల్) సెప్టెంబరులో పునఃప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఉప్పుటేరులో చేపలు మృత్యువాత

» సెజ్ కర్మాగారాల కాలుష్య వ్యర్థాలే కారణమని మత్స్యకారుల ఆరోపణ


ఉప్పుటేరులో చనిపోయిన చేపలను చూపుతున్న మత్స్యకారుడు

అచ్యుతాపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పూడిమడక ఉప్పుటేరులో శుక్రవారం పెద్ద సంఖ్యలో చేపలు చనిపోయి నీటిపై తేలాయి. వీటిని చూసిన మత్స్యకారులు తీవ్ర ఆవేదన చెందారు. సెజ్‌లోని ఫార్మా కంపెనీలు, ఇతర కర్మాగారాల నుంచి శుద్ధి చేయని వ్యర్థాలను నేరుగా ఉప్పుటేరులోకి విడిచిపెట్టడం వల్ల చేపలు చనిపోతున్నాయని వాపోయారు. దీనిపై ఏపీఐఐసీ, మత్స్య శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

మార్కెట్ యార్డు అభివృద్ధే లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

అందిస్తానని తెలిపారు. తొలుత ఏఎంసీ చైర్మన్‌గా గవిరెడ్డి వెంకటరమణ, వైస్ చైర్మన్ చిటికెల కన్నయ్యనాయుడు, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ మాట్లాడుతూ, స్పీకర్ సహాయ సహకారాలతో మార్కెట్ యార్డు అభివృద్ధి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, కౌన్సిలర్లు చింతకాయల పద్మావతి, రాజేశ్, ఆర్డీవో వీవీ రమణ, మునిసిపల్ కమిషనర్ సరేంద్ర, జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ, జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి సూర్యచంద్ర, తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ, తహసీల్దార్ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

క్రైం... crime news

చీటీల పేరిట మోసం

» లక్షలాది రూపాయలతో నిర్వాహకురాలు పరారీ
» పోలీసులను ఆశ్రయించిన బాధితులు


ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న బాధితులు


చీటీల నిర్వాహకురాలు పెదిరెడ్ల పద్మజ (ఫైల్)

కె.కోటపాడు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడువాడలో లక్షలాది రూపాయలతో చీటీల నిర్వాహకురాలు పరారైంది. దీంతో బాధితులు శుక్రవారం కె.కోటపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని చౌడువాడ శివారు గరుగుబిల్లికి చెందిన పెదిరెడ్ల పద్మజ అలియాస్ చల్లపల్లి పద్మకు సామర్లకోటకు చెందిన శ్రీనుతో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. భర్త చనిపోవడంతో 15 ఏళ్ల కిందట చౌడువాడకు వచ్చి స్థిరపడింది. అప్పటి నుంచి గ్రామస్థులతో పరిచయాలు పెంచుకొని చీటీల వ్యాపారం నిర్వహిస్తోంది. గ్రామంలో పండుగలకు, ఇతర కార్యక్రమాలకు భారీగా విరాళాలు ఇస్తూ నమ్మకం పెంచుకుంది. ఒక పక్క రూ.లక్షల్లో చీటీలు నిర్వహిస్తూ మరో వైపు మహిళలను ఆకర్షించి పప్పుల చీటీలు, వరలక్ష్మి వ్రతం పేరుతో బంగారం కాసుల చీటీలను ప్రారంభించింది. క్రమంగా రూ.20 లక్షల చీటీలు కూడా వేస్తోంది. నమ్మకం కలిగిన వారు పాడిన మొత్తాన్ని కూడా వడ్డీకి తిరిగి ఆమెకే ఇచ్చేవారు. ఇలా సుమారు రూ.5 కోట్ల వరకు వసూలు చేసి వారం రోజులు కిందట ఆరోగ్యం బాగోలేదని కుమారుడితో సహా ఇంటి నుంచి వెళ్లిన పద్మజ తిరిగి రాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉండడంతో బాధితులకు అనుమానం కలిగింది. అంతకు ముందు బ్యాంకులో కుదువ పెట్టిన రూ.12 లక్షల విలువైన బంగారం ఆభరణాలు పరారయ్యే ముందు విడిపించుకుని పట్టుకుపోయినట్టు బాధితులు చెబుతున్నారు. ఆమెకు సన్నిహితంగా ఉండే చౌడువాడకు చెందిన ఒక వ్యక్తికి ఈ వ్యవహారంతో సంబంధం ఉందని ఆరోపిస్తున్నారు. గ్రామానికి చెందిన సుమారు 200 మంది బాధితులు లబోదిబోమంటూ సర్పంచ్ దాడి ఎరుకునాయుడును వెంట బెట్టుకుని కె.కోటపాడు ఎస్ఐ ధనుంజయను కలిసి ఫిర్యాదు చేశారు.

56 కిలోల గంజాయి స్వాధీనం: ఒకరి అరెస్టు

కె.కోటపాడు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆనందపురం గ్రామంలో శుక్రవారం 56 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఒకరి అరెస్టు చేశామని ఏ.కోడూరు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. శుక్రవారం ఆనందపురం గ్రామంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో తమిళనాడు రాష్ట్రం మదురైకి చెందిన చెల్లం తవశి(65) ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. అతనిని ఆపి తనిఖీ చేయగా 56 కిలోల గంజాయి దొరికింది. జి. మాడుగుల అటవీ ప్రాంతంలో దీనిని కొనుగోలు చేసినట్టు అతను తెలిపాడు. గంజాయిని స్వాధీనం చేసుకుని అతనిని రిమాండ్ నిమిత్తం చోడవరం కోర్టుకు పంపామని ఎస్ఐ తెలిపారు.

వడ్డాది కేజీబీవీ ప్రిన్సిపాల్‌కు అస్వస్థత

» రివ్యూ మీటింగ్‌కు చోడవరం ఎమ్మెల్యే కార్యాలయానికి వచ్చి స్పృహ తప్పిన వైనం


ఆస్పత్రి నుంచి ప్రిన్సిపాల్‌ను ఇంటికి తీసుకువెళుతున్న కుటుంబ సభ్యులు

చోడవరం/బుచ్చెయ్యపేట జూన్ 27 (ఆంధ్రజ్యోతి): చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు కార్యాలయంలో శుక్రవారం రివ్యూ మీటింగ్‌కు హాజరైన వడ్డాది కేజీబీవీ ప్రిన్సిపాల్ అన్నపూర్ణ స్పృహ తప్పి పడిపోయారు. ఆమెను వెంటనే చోడవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వడ్డాది కేజీబీవీలో ఆరవ తరగతిలో ప్రవేశాలకు డిమాండ్ ఉంది. సీట్ల విషయంలో రాజకీయ జోక్యం కూడా పెరిగింది. మిగులు సీటు విషయమై తాము సిఫారసు చేసిన వారికి ఇవ్వకపోవడంతో ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ప్రిన్సిపాల్‌కు కబురు వచ్చింది. ఆమె శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లగా ఎమ్మెల్యే నిలదీసినట్టు సమాచారం. దీంతో ఆమె భయాందోళనకు గురై స్పృహ తప్పి పడిపోయినట్టు తెలిసింది. ఆమెను వెంటనే చోడవరం ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతున్నారు.

ఇలాగైతే ఉద్యోగాలు చేయలేం


విలేకరులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భర్త కామేశ్

ప్రిన్సిపాల్ భర్త కామేశ్, ఆమె బంధువులు శుక్రవారం సాయంత్రం ఆస్పత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు. సాయంత్రానికి ఆమె ఆరోగ్యం మెరుగుపడడంతో ఇంటికి తీసుకు వెళ్లిపోయారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భర్త కామేశ్ విలేకరులతో మాట్లాడుతూ, తాము చెప్పిన వారికి సీటు రాలేదని చెప్పి, రసూల్ అనే వ్యక్తి బయట ఎలా తిరుగుతావో చూస్తామని తన భార్యను బెదిరిస్తున్నాడని వాపోయారు. స్థానిక రాజకీయాల వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని, ఇలాగైతే ఉద్యోగాలు చేయలేమని ఆందోళన వ్యక్తం చేశారు. రసూల్ బెదిరింపులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కలిసి కోరతామని చెప్పారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	80.00
లైవ్ ధర	100.00
విత్ స్కిన్	170.00
స్కిన్ లెస్	180.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	580
విజయనగరం	584
శ్రీకాకుళం	584